PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 9 | విజయవాడ, బుధవారం 9 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 9 August 2023 | Rs

నేడు వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా

- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమకానున్న రూ.141.60 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా ఈ ఏడాది ఏప్రిల్, జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 18,883 జంటలకు రూ.141.60 కోట్లు ఆర్థికసాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమకానున్నాయి. బుధవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేయనున్నారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫాకు సంబంధించి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం జగనన్నకు చెబుదాం 1902 టోల్‌ఫ్రీ నెంబరుకు సంప్రదించవచ్చు. పూర్తి వివరాలకు నవశకం బెనిఫీషియరీ మేనేజ్‌మెంట్ పోర్టల్ https//gsws-nbm.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చని ప్రభుత్వం పేర్కొంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

దేవాదాయ భూముల పరిరక్షణ చట్టంతో సత్ఫలితాలు : మంత్రి కొట్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేవాదాయ భూముల పరిరక్షణ చట్టం సత్ఫలితాలిస్తోందని, ఆదాయానికి తగ్గట్లుగా వర్గీకరణలో మార్పులు చేస్తున్నామని దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, అన్నవరం వీరవెంకట సత్యనారాయణస్వామి, ద్వారకా తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయాలు యాత్రికుల తాకిడితో ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా సెప్టెంబరు నెలలో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనంపై టిఎస్ఆర్‌టిసి అధ్యయనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసిన తీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ ఆర్‌టిసి ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్రంలో పర్యటించింది. తెలంగాణ నుంచి టిఎస్ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎస్ కృష్ణకాంత్, పివి మునిశేఖర్, చీఫ్ ఫైనాన్సియల్ మేనేజర్ విజయ పుష్పకుమారి తదితరులు విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌ను సందర్శించారు. విలీనం తర్వాత ఉద్యోగుల పరిస్థితి, ఉద్యోగుల సంక్షేమం, ఆర్థిక అంశాలపై ఎపిఎస్ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావును అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్‌టిసి స్థితిగతులను ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమావేశంలో ఎపిఎస్ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కెఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎ కోటేశ్వరరావు, పి కృష్ణమోహన్, ఫైనాన్సియల్ అడ్వైజర్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయండి

- ముగిసిన విఆర్ఎల 36 గంటల దీక్ష
- ప్రభుత్వం స్పందించకుంటే 25న చలో విజయవాడ



అమలాపురంలో అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న విఆర్ఎలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అర్హులకు ప్రమోషన్లు, ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని, సిపిఎస్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకులు చేపట్టిన 36 గంటల దీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో ఈ దీక్షలను కొనసాగించారు. నామినీలుగా పనిచేస్తున్న వారసులను విఆర్ఎలుగా కొనసాగించాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని నినాదాల చేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

గుంటూరు కలెక్టరేట్ ఎదుట విఆర్ఎలు చేపట్టిన దీక్షలనుద్దేశించి ఎపి విఆర్ఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకాశీ మాట్లాడారు. విఆర్ఎల సమస్యలు పరిష్కరించకపోతే సిఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.300 డిఎను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందచేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద విఆర్ఎలు చేపట్టిన 36 గంటల దీక్షల విరమణ సందర్భంగా నిర్వహించిన సభలో రాజ్యసభ మాజీ ఎంపి పెనుమల్లి మధు మాట్లాడుతూ.. విఆర్ఎల సమస్యలు పరిష్కరించకుంటే ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్మికులు, ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ధోరణి అమానవీయంగా ఉందని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించి ఏళ్లు గడుస్తున్నా రూ.26 వేల వేతనానికి విఆర్ఎలు నోచుకోలేదని తెలిపారు. విఆర్ఎల సమస్యలు న్యాయమైనవని, సిఐటియు సంపూర్ణ సహకారం అందిస్తుందని సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. నాగరాజు అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనకాపల్లి కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షల్లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు విఆర్ఎలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటుచేసుకుంది. డిఆర్ఒ వెంకటరమణ బయటకు వచ్చి విఆర్ఎల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి వీటిని తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ ఎదుట చేపట్టిన నిరసన దీక్షను విరమించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విఆర్ఎల ధర్నా కొనసాగింది. కర్నూలు ధర్నాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేశారు. కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు ప్రధాన గేట్‌ను మూసివేసి అడ్డగించారు. కలెక్టరేట్ ఎఒ బయటకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ధర్నా చౌక్ వద్ద దీక్షలనుద్దేశించి ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ తరహాలో విఆర్ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురంలో అర్ధనగ్న ప్రదర్శనతో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. కాకినాడ జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లా అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలను నిర్వహించారు. అమలాపురంలో విఆర్ఎలు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ప్రకాశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. నెల్లూరు, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షలు ముగిశాయి.

జిఒ 108ను రద్దు చేయాలి

- డైరెక్టర్ ఆఫ్ వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖ అధికారికి ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి-మంగళగిరి (గుంటూరు జిల్లా)

వైద్య విద్యకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 108ను వెంటనే రద్దు చేయాలని కెవిపిఎస్, ప్రజా ఆరోగ్య వేదిక, ఎస్‌సి, ఎస్‌టి రైట్ అండ్ యాక్ట్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ, గిరిజన, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసి, ప్రభుత్వ మెడికల్ కాలేజీలో రిజర్వేషన్లు తగ్గించారని తెలిపారు. మెడికల్ కాలేజీల్లో 50 శాతం జనరల్ సీట్లు, 30 శాతం సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు, 15 శాతం ఎన్ఆర్ఐ సీట్లుంటూ మూడు గ్రూపులుగా విభజించారని పేర్కొన్నారు. ఏడాదికి జనరల్ కేటగిరి రూ.15 వేలు, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీ కింద రూ.12 లక్షలు, ఎన్ఆర్ఐ కేటగిరీ కింద రూ.20 లక్షలు ఫీజులుగా నిర్ణయించారని వివరించారు. ఈ చర్యలను విరమించుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవిఎస్ డాక్టర్ సాయి ప్రసాద్, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.భాస్కరయ్య, ఎస్‌సి, ఎస్‌టి రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి రామారావు తదితరులు ఉన్నారు.

పుంగనూరు ఘటనలో మొదటి ముద్దాయి చంద్రబాబే

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పుంగనూరులో జరిగిన హింసాత్మక ఘటనలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై మొదటి ముద్దాయిగా కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పక్కా స్కెచ్‌తోనే పుంగనూరులో అల్లర్లు చేయించారని అన్నారు. అధికారం లేకపోతే రౌడీయిజం, బరితెగింపుతో ఏకంగా పోలీసులపైనే దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.

చంద్రబాబు రౌడీమూకలతో యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. రాళ్లు, కర్రలు, తుపాకులు తీసుకుని యాత్రలు చేయడం అరాచకం కాదా? అని ప్రశ్నించారు. పుంగనూరు ఘటనలో పోలీసులకు, వైసిపి కార్యకర్తలకు దెబ్బలు తగిలితే టిడిపి కార్యకర్తలకు దెబ్బలు తగిలినట్లు తప్పుడు ప్రచారం చేసుకుంటున్నా రని అన్నారు. పోలీసుల భద్రత లేకుండా ఒక్క అడుగు ముందుకువేయలేని లోకేష్ ఎస్‌పి రిషాంత్‌రెడ్డిపై అవాకులు, చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ ఫిల్మ్ నగర్ నుంచి ఎపి సచివాలయానికి ఎంత దూరమో, ఎపి సచివాలయం నుంచి ఫిల్మ్ నగర్‌కు అంతే దూరమనే అంశాన్ని చిరంజీవి గుర్తించుకోవాలని కోరారు. సినిమాను సినిమాగా, రాజకీయాన్ని రాజకీయంగా చూడాలన్నారు. రాష్ట్ర విభజన సమయంలో చిరంజీవి ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలన్నారు. చిరంజీవి కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్రానికి ప్రత్యేక హోదా హామీ వచ్చిందని, రాష్ట్రానికి అన్యాయం జరిగితే చిరంజీవి ఎందుకు స్పందించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.



ఏలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కొబ్బరికాయల రైతుల సంఘం నేతలు

కొబ్బరి రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

కొబ్బరికాయల కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరిచి, రైతుల నుండి కొబ్బరికాయలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కొబ్బరి రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కొబ్బరికాయలకు కనీస ధరలు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోనూ, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలోనూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కొబ్బరి రైతులకు కనీస ధరలు రాక నష్టపోతున్నారని అన్నారు. తోటల్లో నిల్వబెట్టిన కొబ్బరికాయలు వర్షాలకు తడిచి మొలకలు వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే తెగుళ్లతో కొబ్బరి రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుండి కొబ్బరికాయలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరల స్థిరీకరణ నిధి పథకం కొబ్బరి రైతులకూ వర్తింపజేయాలని కోరారు. ధర్నాలో కొబ్బరి రైతుల సంఘం నాయకులు బొల్లి రామకష్ణ, పి.అచ్యుతరామయ్య, గంటా పాపారావు, ఎ.నాగేశ్వరరావు, గుదిబండి రమేష్ రెడ్డి, పలువురు కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

జగన్‌కు జనం కష్టాలు పట్టవు

- ప్రజల కన్నీళ్లు తుడుస్తా : లోకేష్



పిడుగురాళ్ల బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వల్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లోకి వెళ్లడంలేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పాదయాత్రలో భాగంగా పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో మంగళవారం నారా లోకేష్ పాదయాత్ర నిర్వహించారు. పిడుగురాళ్లలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలు కష్టాల్లో ఉన్నా జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌లోనే ఉంటారని అన్నారు. తాను ఇప్పటి వరకు 2300 కిలో మీటర్ల పాదయాత్రలో ప్రజల కష్టాలు చూశానని, వారి కన్నీళ్లతుడుస్తానని భరోసా ఇచ్చారు. భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించామని, ఇంకా మరిన్ని ప్రకటిస్తామని తెలిపారు. జగన్ జనంలోకి వెళ్లరని, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ప్రజల్లోకి వెళితే ఓర్వలేక రాళ్లు వేయిస్తారని విమర్శించారు. సిఎం ఇంట్లోనే దొంగలుపడ్డారని, సిఎం డిజిటల్ సైన్‌తో 225 ఫైల్స్ ద్వారా సెటిల్‌మెంట్‌లు జరిగాయని ఆరోపించారు. ఆయనకు తెలియకుండా ఫైళ్లు క్లియర్ అవుతున్నాయని, కోట్ల రూపాయలు చేతులు మారాయని విమర్శించారు. కీలకమైన ఫైళ్లు క్లియర్ అయినా అటెండర్లు, డేటా ఆపరేటర్ల మీద కేసు పెట్టి చేతులు దులుపుకున్నారని అన్నారు. ఈ స్కామ్ వెనుక ఎవరున్నారో తేలాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి యువత భవిష్యత్తుపై జగన్ దెబ్బకొట్టారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రభుత్వ, ప్రయివేట్, స్వయం ఉపాధి ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో శాసన మండలి మాజీ చైర్మన్ ఎం.ఎ.షరీఫ్, మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, పత్తిపాటి పుల్లారావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, బొండా ఉమామహేశ్వరరావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, జి.వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణలో టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్

- బొత్సకు ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణలో టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్ అంశాన్ని చేర్చాలని ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు విజ్ఞప్తి చేశాయి. మంగళవారం విజయవాడలో ఎపిటిఎఫ్, ఎంటిఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి బొత్స సత్యనారాయణ సమావేశమయ్యారు. పాఠశాల విద్యాకమిషనర్ సురేష్‌కుమార్, జెడి సర్వీసెస్ మువ్వా రామలింగం, ప్రభుత్వ పరీక్షల సంచాలకులు దేవానందరెడ్డి తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు పలు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. ఎపిటిఎఫ్ నుండి జి హృదయరాజు, చిరంజీవి, ఎంటిఎఫ్ నుండి రామకృష్ణలు మంత్రి బొత్స సత్యనారాయణకు సమస్యలను వివరించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణలో టీచర్ల ఉమ్మడి సర్వీసు రూల్స్ అజెండాను చేర్చాలని కోరారు. అలాగే బదిలీల అనంతరం టీచర్లకు వేతనాలు రావడంలేదని తెలిపారు. బదిలీల ప్రక్రియలో రిలీవర్ లేరని ఆలస్యం జరుగుతోందని, తక్షణం పూర్తి చేయాలని కోరారు. అలాగే మున్సిపల్ సర్వీసు రూల్స్ ఆలస్యమయ్యే అవకాశం వున్నందున పాత రూల్స్ ప్రకారం సర్వీస్ రూల్స్‌ను తయారు చేయాలని కోరారు. ఎస్‌ఎస్‌సి పరీక్షల్లో ఫిజిక్స్‌కు, బయాలజీకి వేర్వేరుగా 50 మార్కులతో ప్రశ్నాపత్రాన్ని తయారు చేయాలని కోరారు. ఎంఈఓలకు సంబంధించి 1,2లకు సమానబాధ్యతలను ఇవ్వాలని కోరారు.

అస్తవ్యస్తంగా వైసిపి పాలన

- ప్రజల్లో చైతన్యం చూశాక మనస్ఫూర్తిగా వెళ్తున్నా
- రాబోయే రోజుల్లో విజయం మనదే
- కోరుకొండ బహిరంగ సభలో చంద్రబాబు



ప్రజలకు బాబు అభివాదం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, దేవరపల్లి, గోపాలపురం

వైసిపి పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఓవైపు నిత్యావసర సరుకుల ధరలు, కరెంటు ఛార్జీలు, మరోవైపు అవినీతి, అక్రమాలు పెచ్చరిల్లుతున్నాయని టిడిపి అధినేత చంబ్రాబునాయుడు విమర్శించారు. రెండో రోజు పర్యటనలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలో ఆయన మంగళవారం రోడ్‌షో, బహిరంగ సభ నిర్వహించారు. తొలుత రాజమహేంద్రవరంలో నీటి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం రాజానగరం మీదుగా రోడ్డు షో నిర్వహించి సీతానగరంలోని చాగల్నాడు ప్రాజెక్టును పరిశీలించారు. ఆ తర్వాత శ్రీరంగపట్నం మీదుగా కోరుకొండ చేరుకున్నారు. అక్కడ బహిరంగ సభలో మాట్లాడారు. ఎక్కడికక్కడే తనకు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రజల్లో ఈ చైతన్యం చూశాకా మనస్ఫూర్తిగా వెళ్తున్నానని అన్నారు. రాబోయే రోజుల్లో జగన్ పాలనపోయి సైకిల్ పాలన రావడం ఖాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, తాను అధికారంలోకి రాగానే బ్రహ్మాండమైన రోడ్లు వేస్తానని అన్నారు. భావితరాల భవిష్యత్తు, సమాజ స్థితిగతులను ఆలోచించి రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఓటు వేయాలని కోరారు. రాష్ట్రం మొత్తంలో జె ట్యాక్స్, రాజానగరం నియోజకవర్గంలో జక్కంపూడి ట్యాక్స్ నడుస్తోందని విమర్శించారు. భూములుకొని ప్రభుత్వానికి తిరిగి విక్రయించడం ద్వారా రూ.500 కోట్లు స్కాముకు జక్కంపూడి పాల్పడ్డారని, ఎంఎల్ఎ సోదరుడు కొండలను కరిగించేశారని ఆరోపించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తన హయాంలో ఇటువంటివి ఉన్నాయా? అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే అక్రమార్కుల సంగతి తేల్చే బాధ్యత తీసుకుంటానన్నారు. ఎవరు తప్పు చేసినా విడిచిపెట్టేది లేదని తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించి శాశ్వత హక్కు కల్పిస్తానన్నారు.

చంద్రబాబు వల్లే అవరోధం : అంబటి

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)

డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో చంద్రబాబు చేసిన తప్పిదమే పోలవరం ప్రాజెక్ట్‌కు అవరోధంగా మారిందని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో మంత్రి పర్యటించారు. అనంతరం ప్రాజెక్ట్ సమావేశపు హాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, స్పిల్ ఛానల్, స్పిల్ వే పూర్తి చేయకుండా, గోదావరి నీళ్లు మళ్లించకుండా.. డయాఫ్రమ్ వాల్ నిర్మించడమే చంద్రబాబు చేసిన చారిత్రాత్మక తప్పిదమన్నారు. దీనివల్లే 2019-20లో వచ్చిన వరదల కారణంగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన జాతీయ ప్రాజెక్ట్‌ను తానే నిర్మిస్తానని ఎందుకు ఒప్పుకున్నారని ప్రశ్నించారు. 2018లో పూర్తిచేసి జాతికి అంకితం చేస్తానని చెప్పి ఎందుకు పూర్తి చేయలేకపోయారని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ 45.72 కాంటూరుకే నిర్మిస్తామని, 41.15 కాంటూరుకు తగ్గిస్తామన్న ప్రచారంలో నిజంలేదన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో మూడు దశలుంటాయని, మొదటి దశలో 41.15 కాంటూరు వరకూ నిర్మించి నీటి నిల్వచేసి పరిశీలిస్తామని, ఏమైనా సమస్యలుంటే గుర్తించి సరిచేస్తామని తెలిపారు. అనంతరం రెండో దశలో కూడా అదేవిధంగా పరిశీలిస్తామని చెప్పారు. చివరిగా 45.72 కాంటూరుతో ప్రాజెక్టును నిర్మిస్తామని స్పష్టం చేశారు.

దిగ్భ్రాంతికరం

- జహీర్ ఆకస్మిక మృతిపై మధు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సియాసత్ ఉర్దూ పత్రిక ఎండి జహీరుద్దీన్ అలీఖాన్ ఆకస్మిక మృతి పట్ల సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ పెనుమల్లి మధు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జహీర్ మరణవార్త తనకు, తన కుటుంబ సభ్యులకు దిగ్భ్రాంతి కలిగించిందని పేర్కొన్నారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, సమాఖ్యవాదం, స్వావలంబనలకు జహీరుద్దీన్ బలమైన రక్షకులుగా పనిచేశారని మధు గుర్తు చేసుకున్నారు. జహీరుద్దీన్ ఒక మంచి దేశభక్తి కలిగిన మిత్రులని, ఆయన మృతి దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. జహీరుద్దీన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

ప్రధానిని పార్లమెంట్‌కు రప్పించడమే లక్ష్యం!

- ఓట్ల కోసం దేశాన్ని తగలబెడుతున్నారు
- అవిశ్వాస తీర్మానంపై చర్చలో సిపిఎం ఎంపి ఎఎం ఆరీఫ్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం తరపున అవిశ్వాస తీర్మానానికి పూర్తిగా మద్దతు ఇస్తున్నామని సిపిఎం ఎంపి ఎఎం.అరీఫ్ తెలిపారు. ప్రధాన మంత్రిని సభకు రప్పించడం కోసం ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం దేశ పార్లమెంట్ చరిత్రలో ఇదే తొలిసారని అన్నారు. ప్రధాని మోడీ సభకు రావాలని తాము నినాదాలు చేస్తుంటే, ఆయన పార్లమెంట్‌కు రాకుండా, కేబిన్‌లో కూర్చొని ప్రజలను ఎలా విభజించాలా అని పదే పదే ఆలోచిస్తున్నారని విమర్శించారు. "ప్రధాని పార్లమెంట్‌కు రావడానికి ఎందుకు వెనుకాడుతున్నారు? అని ప్రశ్నించారు.

రోమన్ సామ్రాజ్యం మండుతున్నప్పుడు పియానో వాయించిన నీరో చక్రవర్తితో ప్రధాని మోడీని దేశ, విదేశాల్లోని ప్రముఖ మీడియాలన్నీ పోల్చాయని ఆరీఫ్ తెలిపారు. అతి తక్కువ సమయం సభకు హాజరైన ప్రధానిగా మోడీ రికార్డు సృష్టించారని దీన్ని మరెవరూ బద్దలు కొట్టలేరని అన్నారు. మణిపూర్ హింసాకాండ జరిగిన 80రోజులకు ప్రధాని స్పందించారని, ఇది సిగ్గుచేటని విమర్శించారు.

ఒకపక్క మణిపూర్ మంటల్లో మండుతుంటే, మరోపక్క మన ప్రధాని ఫ్రాన్స్‌కు వెళ్లి ప్రపంచ శాంతి గురించి ప్రసంగించారని అన్నారు. ఈ సందర్భంగా తనకొక సామెత గుర్తుకు వస్తోందన్నారు. "ఆయన దుర్వాసన వెదజల్లుతూ సుగంధ ద్రవ్యాలు అమ్ముతాడు" అని వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వానికి సిగ్గుంటే, ప్రధాని, హోంమంత్రి తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు.

ఈ నేపథ్యంలోనే హర్యానాలో కూడా మతపరమైన అల్లర్లు విస్తరించాయన్నారు. ఈ విభజన శక్తుల నుండి దేశాన్ని కాపాడేందుకే అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసి ఇండియాగా ఏర్పాడ్డాయని అన్నారు. కేరళలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో వామపక్షాలను ఓడించేందుకు సిబిఐ, ఈడి, ఎన్ఐఎ, ఆదాయపు పన్ను, సెంట్రల్ విజిలెన్స్, కస్టమ్స్, కాగ్ వంటి తొమ్మిది ఏజెన్సీలను పంపారని, కానీ అక్కడ సిపిఎం ప్రభుత్వాన్ని ఓడించలేకపోయారని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా ఇండియా కుటమిని ఓడించేందుకు అనేక కుట్రలు పన్నుతున్నారని, కానీ ఆ పప్పులేవీ ఉడకవని అరీఫ్ స్పష్టం చేశారు.

ఇప్పుడు ప్రధాని మోడీ మొదట ఇచ్చిన మేక్ ఇన్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, స్టార్టప్ ఇండియా మొదలైన నినాదాలను మరచిపోయేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎందుకంటే ఆయా నినాదాల్లో ఇండియా అనే పదం ఉందని ఎద్దేవా చేశారు. ఆర్ఎస్ఎస్ నాయకత్వం స్వాతంత్ర్య ఉద్యమానికి వ్యతిరేకంగా వున్నందువల్లే క్విట్ ఇండియా గురించి ప్రధాని మోడీకి తెలియదని ఎద్దేవా చేశారు. ప్రస్తుత పార్లమెంట్‌లో జర్నలిస్టులు ప్రవేశించడానికి అనుమతి లేదని, దీనికి కారణం ప్రధాని మోడీకి మీడియా అంటే ద్వేషం, భయం అని అన్నారు. ఈ సభలో బిజెపి తనకున్న మెజార్టీతో అవిశ్వాస తీర్మానాన్ని ఓడించవచ్చుని, కానీ దేశంలోని ప్రజా బలంతో తాము బిజెపి ప్రభుత్వంపై అసలైన అవిశ్వాసాన్ని పెట్టగలమని తమకు గట్టి నమ్మకం ఉందన్నారు.

విశాఖ ఉక్కు.. ప్రజల సొత్తు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సొత్తు అని, అమ్మే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 908వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ట్రాఫిక్ విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్య ఫలాలను, దేశ సంపదను అదానీ, అంబానీలకు బిజెపి పాలకులు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే దేశ ప్రజల దృష్టిని మరల్చేందుకు మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపికి ఇవే చివరి ఎన్నికలు అవుతాయన్నారు. దీక్షల్లో స్టీల్ ట్రాఫిక్ విభాగం కార్మికులు ఎస్.గోవిందరావు, జి.విశ్వేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, వడ్డీ రమణ, గంటా రామారావు, ఎస్.ఈశ్వరరావు, రంగయ్య నాయుడు, సంతోష్, పివి.రమణ, సలాది శ్రీను, రామన్న పాల్గొన్నారు.

ఆదివాసీ వ్యక్తిపై బిజెపి నేత జులుం

అసభ్య పదజాలంతో దూషణ.. దాడి

- మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ఘటన

ముంబయి : బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆదివాసీలు, దళితులు, మహిళలపై దాడులు తీవ్రమవుతున్నాయి. మణిపూర్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని ఘటనలు మరవకముందే మహారాష్ట్రలో మరొకటి చోటు చేసుకున్నది. పాల్ఘర్ జిల్లాలోని స్థానిక బీజేపీ నాయకుడు భరత్ రాజ్‌పుత్, మరో ముగ్గురు గిరిజన వ్యక్తి(57)పై దాడికి దిగారు. అసభ్య పదజాలంతో దూషించారు. కీలక నిందితుడైన భరత్ రాజ్‌పుత్.. బీజేపీ పాల్ఘర్ జిల్లా విభాగానికి కొత్త అధ్యక్షుడిగా ఇటీవల నియమితులయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు నవపాడ గ్రామానికి చెందిన ఆదివాసీ వ్యక్తి. ఇతను ఒక రైతు, సామాజిక కార్యకర్త. గ్రామంలో రోడ్లు, నీటికి సంబంధించిన సమస్యలను చెప్పాలని ఈనెల 4న ఒక స్థానిక సంస్థ ఆయనను ఆహ్వానించింది. ఆ తర్వాత బాధితుడికి రాజ్‌పుత్ నుంచి ఫోన్ వచ్చింది. తన కార్యాలయంలో తనను కలవాలని బాధితుడిని అడిగాడు. అయితే, బాధితుడు ఇతర సంస్థకు చెందిన వ్యక్తులతో రాజ్‌పుత్ కార్యాలయ పరిసరాల్లోకి వచ్చాడు. దీంతో కోపోద్రేక్తుడైన రాజ్‌పుత్, ఆయన అనుచరులు బాధితుడిపై దూషణకు దిగారు. ఆయనను కొట్టారు. కులంపేరుతో దారుణంగా తిట్టారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. రాజ్‌పుత్ సోదరుడు జగదీష్‌తో పాటు విశాల్ నందాల్కర్, రాజేష్ ఠాకూర్‌ల పేర్లను నిందితులుగా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

చంద్రబాబుపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి

- రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

హింసాత్మక రాజకీయాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, పుంగనూరులో ఆయన ఇదేవిధమైన కుట్రను అమలు చేశారని, ఈ క్రమంలో ఆయనపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం సాయంత్రం విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసులను రెచ్చగొట్టడం, తద్వారా వారు ఫైరింగ్ ఓపెన్ చేస్తే ఎవరో ఒకరు చనిపోతే తమ పార్టీ కార్యకర్తలను అన్యాయంగా చంపారంటూ ఒక డ్రామాతో రాజకీయ లబ్ధి పొందాలనేది బాబు రాజకీయ పన్నాగమని అన్నారు. పోలీసులు ఒక వైపు దెబ్బలు తింటున్నా ఎక్కడా సంయమనం కోల్పోకుండా నిబద్ధతతో విధులు నిర్వహించారని చెప్పారు. దీంతో చంద్రబాబు దుష్టాలోచన పారలేదన్నారు. పుంగనూరు బైపాస్‌లో పోలీసులపై టిడిపి దాడికి ముమ్మాటికీ చంద్రబాబునే కారకుడని, ఈ కేసులో అతనే ప్రథమ ముద్దాయి అని తెలిపారు. అధికారం దక్కించుకోవడానికి చంద్రబాబు ఎంత నీచానికైనా దిగజారుతాడనేది మరోమారు స్పష్టమైందన్నారు. పుంగనూరులో అంతపెద్ద ఘటన జరిగినప్పుడు అందుకు కారణమైన వ్యక్తి ఎవరు.? ఏ విధంగా ప్లాన్ చేశారు ? ఎందువల్ల ఈ ఘటన జరిగింది ? అనే అంశాలపై మీడియా ఆలోచన చేయాలన్నారు.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 9 | విజయవాడ, బుధవారం 9 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 9 August 2023 | Rs

కనీస వేతనం అమలు చేయండి

- ముగిసిన విఆర్ఎల 36 గంటల దీక్ష
- ప్రభుత్వం స్పందించకుంటే 25న చలో విజయవాడ

లోపలి పేజీలో..



శివాలెత్తిన సూర్యకుమార్

- మూడో టి20లో 7వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు



పోరుయాత్ర ముగింపు సభలో అభివాదం చేస్తున్న బృందాకరత్, పుణ్యవతి, రమాదేవి, ప్రభావతి తదితరులు

హింసపై రణభేరి

స్ఫూర్తిదాయకంగా పోరుయాత్ర ముగింపు సభ

భారీగా తరలివచ్చిన మహిళలు • 'మణిపూర్' బాధితులకు సంఘీభావం

దాడులను అదుపుచేయడంలో మోడీ సర్కారు విఫలం : బృందా కరత్

రాష్ట్ర మహిళాలోకం రణభేరి మోగించింది. మహిళలను, బాలికలను, చిన్నారులను లక్ష్యంగా చేసుకుని దేశవ్యాప్తంగా ముష్కర మూకలు చెలరేగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిష్క్రియా పూర్వకంగా వ్యవహరించడాన్ని నిలదీసింది. మణిపూర్‌లో మతోన్మాద శక్తుల చేతుల్లో అత్యాచారాలకు, అమానుషత్వానికి గురైన బాధితులకు సంఘీభావం ప్రకటించింది. ఆ దుస్థితికి కారకులైన వారిని క్షమించేది లేదని హెచ్చరించింది. ఇంత జరుగుతున్నా ప్రధానమంత్రి నరేంద్రమోడీ పెదవి విప్పకపోవడాన్ని తప్పు పట్టింది. దేశ వ్యాప్తగా అత్యాచారాలు, అమానుషాలను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేసింది. రాష్ట్రంలోనూ మహిళల పట్ల పెరుగుతున్న హింసాకాండ పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దారుణాలను అధ్యయనం చేసి, నివారణకు అవసరమైన చర్యలను సిఫార్సు చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరింది. మహిళల పట్ల పెరుగుతున్న హింసపై ప్రజానీకాన్ని చైతన్యం చేయడమే లక్ష్యంగా ఐద్వా ఆధ్వర్యంలో గత నెల 28న ప్రారంభమైన హిందూపురం, విశాఖపట్నంలో ప్రారంభమైన యాత్రలు మంగళవారం విజయవాడలో ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆరువేల కిలోమీటర్లు ఈ యాత్రలు సాగాయి. వివిధ జిల్లాల్లో 200కు పైగా సభలను నిర్వహించి, విద్యార్థినులను, మహిళలను ఐద్వా నేతలు, కార్యకర్తలు కలిశారు. మనువాద, మతోన్మాద శక్తులు దేశ వ్యాప్తంగా మహిళలపై సాగిస్తున్న అమానుషకాండను వివరించారు. మణిపూర్‌లో సాగిన మారణకాండ, బాల్కిన్‌బానో పై అమానుష అత్యాచార కాండకు పాల్పడిన ముష్కర మూక పట్ల గుజరాత్ ప్రభుత్వ ఉదార వైఖరి పట్ల ప్రజానీకం ఆగ్రహంగా స్పందించారు. యాత్ర ముగింపు సందర్భంగా మంగళ వారం జింఖానాగ్రౌండ్స్‌లో నిర్వహించిన బహిరంగ సభలోనూ అదే స్ఫూర్తి కనిపించింది.మహిళలపై హింసాకాండకు పాల్పడిన వారిని కుల, మతాలకు అతీతంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హింసకు దారి తీస్తున్న మద్యాన్ని, మాదకద్రవ్యాలను, అశ్లీల సాహిత్యాన్ని నియంత్రించాలని ప్రభుత్వాలను కోరారు. సభకు హాజరైన ఐద్వా సీనియర్ నేత, సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ దేశ వ్యాప్తంగా సగటున ప్రతిరోజు 86 మంది మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, జరుగుతున్న హింసకుసంబంధించి 1,151 కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. పోలీస్ స్టేషన్ దాకా రాని కేసులు ఇంకా పెద్దసంఖ్యలోనే ఉంటాయన్నారు. దేశంలో బాలికలు, మహిళలు, దళితులు, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను అదుపుచేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు.

- వివరాలు లోపలపేజీలో...

మోడీ బదులివ్వాల్సిందే

ప్రధాని మౌనవ్రతాన్ని భగ్నం చేసేందుకే అవిశ్వాసం

చర్చ ప్రారంభిస్తూ కాంగ్రెస్ నేత గొగోయ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. తొలుత తీర్మానంపై కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ చర్చను ప్రారంభిస్తూ, తప్పనిసరి పరిస్థితుల్లోనే తాము ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టవలసి వచ్చిందన్నారు. ఇది సంఖ్యా బలానికి సంబంధించినది కాదని, కేవలం మణిపూర్ రాష్ట్రానికి న్యాయం జరగడం కోసమేనని స్పష్టం చేశారు. ఇండియా కూటమి ఈ తీర్మానాన్ని మణిపూర్ రాష్ట్రం కోసమే తీసుకొచ్చిందని, మణిపూర్‌కు న్యాయం జరగాలని కోరుతోందని తెలిపారు. మణిపూర్ ముఖ్యమంత్రి బిరేన్ సింగ్‌ను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. బిజెపి రాజకీయాలు మణిపూర్‌లో రెండు మణిపూర్‌లను సృష్టించాయని దుయ్యబట్టారు. పార్లమెంటులో మాట్లాడకుండా ప్రధాని మోడీ మౌనవ్రతాన్ని చేపట్టారని, ఆ వ్రతాన్ని భగ్నం చేయాలనే తాము ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించామని చెప్పారు. ఇప్పటి వరకు మణిపూర్‌లో ప్రధాని ఎందుకు పర్యటించలేదు? దాదాపు 80 రోజుల తరువాత స్పందించినపుడు కేవలం 30 సెకండ్లు మాత్రమే ఎందుకు మాట్లాడారు? మణిపూర్ ముఖ్యమంత్రిని ఆ పదవి నుంచి ఎందుకు తొలగించడం లేదు? – ఈ మూడు ప్రశ్నలను మోడీని అడుగుతున్నామని చెప్పారు. మణిపూర్ ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. తమ వైఫల్యాలను బిజెపి అంగీకరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వాన్ని కాపాడటం కోసమే మోడీ మౌనంగా ఉన్నారని విమర్శించారు.

ఈ తీర్మానంపై నిషికాంత్ దుబే, నారాయణ్ రణే, సునీతా దుగ్గల్, కిరణ్ రిజిజు (బిజెపి), మనీష్ తివారీ



చర్చలో మాట్లాడుతున్న గొగోయ్

(కాంగ్రెస్), టిఆర్ బాలు (డిఎంకె), సౌగత్ రాయ్ (టిఎంసి), ఎఎం ఆరీఫ్ (సిపిఎం), సుప్రియా సూలే (ఎన్‌సిపి), డింపుల్ యాదవ్ (ఎస్‌పి), ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్‌ఎస్‌పి), అరవింద్ గణపత్ సవంత్ (శివసేన (ఠాక్రే)), సర్దార్ సిమ్రాన్‌జిత్ సింగ్ (ఎస్ఎడిఎం), తిరుమవలవన్ (విసికె), పినాకి మిశ్రా (బిజెడి), శ్రీకాంత్ షిండే (శివసేన (షిండే)), నవనీత్ రాణ (ఇండిపెండింట్ ఎంపి) తదితరులు మాట్లాడారు.

బిజెపి ఎంపి నిషికాంత్ దుబేపై కాంగ్రెస్ ప్రివిలేజ్ నోటీస్

లోక్‌సభలో బిజెపి ఎంపి నిషికాంత్ దుబేపై కాంగ్రెస్ ఎంపి మానికం ఠాగూర్ ప్రివిలేజ్ నోటీస్ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై నిషికాంత్ దూబె 'పూర్తి కల్పితం' అని ఆరోపణలు చేశారని నోటీసులో పేర్కొన్నారు.

మణిపూర్‌లో మేమూ బాధితులమే : దుబే

మణిపూర్‌లో కష్టకాలం వల్ల తాము బాధితులమేనని, తమ సన్నిహిత బంధువు గాయపడ్డారని బిజెపి ఎంపి నిషికాంత్ దుబె అన్నారు. అయితే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సమయంలో కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ సభ్యులు నినాదాలు

మిగతా 5లో

ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతివ్వండి

- సుప్రీంకోర్టులో ఎపి ప్రభుత్వం పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతివ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాలను నిలిపేస్తూ ఎపి హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌కు సర్వోన్నత న్యాయస్థానం రిజిస్ట్రీ డైరీ నెంబరు కేటాయించింది. ఈ పిటిషన్ వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేస్తే తమ వాదనలూ వినాలని రైతులు కోరారు. ఇప్పటికే సుప్రీంకోర్టులో అమరావతి రాజధాని రైతులు కేవియట్ దాఖలు చేశారు. అయితే ఇటీవల అమరావతిలోని ఆర్-5 జోన్‌లో సిఎం జగన్ పట్టాలు అందజేసి, ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ ఇళ్ల నిర్మాణాలను ఆపాలని హైకోర్టులో కొన్ని వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై ఎపి హైకోర్టు స్టే ఇచ్చింది. ఈ స్టేపై జగన్ సర్కారు సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

ప్రధానిని పార్లమెంట్‌కు రప్పించడమే లక్ష్యం !

- ఓట్ల కోసం దేశాన్ని తగలబెడుతున్నారు
- అవిశ్వాస తీర్మానంపై చర్చలో సిపిఎం ఎంపి ఎఎం ఆరీఫ్

లోపలి పేజీలో..

అస్సాం రైఫిల్స్‌పై మణిపూర్ పోలీసుల కేసు

- విధులకు ఆటంకం కలిగిస్తున్నారని అభియోగాలు

ఇంఫాల్ : దేశంలో అత్యంత చరిత్ర కలిగిన పారామిలటరీ దళం అస్సాం రైఫిల్స్‌పై బిజెపి అధికారంలో ఉన్న మణిపూర్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. విధులకు ఆటంకం కలిగించడం, నేరపూరిత బెదిరింపులు.. వంటి అభియోగాలతో రాష్ట్ర పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. అస్సాం రైఫిల్స్‌కు చెందిన 9వ బెటాలియన్ సిబ్బంది కుకీ గ్రూపునకు చెందిన సాయుధ దుండగులు స్వేచ్ఛగా పారిపోయే అవకాశం కల్పించారని, అహంకారపూరిత చర్యకు పాల్పడ్డారని మణిపూర్ పోలీసులు ఆరోపించారు. ఈ నెల 5న బిష్ణుపూర్ జిల్లాలోని ఫొగక్‌చావో ఇఖాయ్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదయింది.

కాగా, మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభమైన మే 3 నుంచి కూడా అస్సాం రైఫిల్స్‌పై బిజెపి నాయకులు ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. ఈ నెల 7న ఏకంగా అస్సాం రైఫిల్స్‌కు వ్యతిరేకంగా ప్రధానమంత్రి మోడీకి బిజెపి రాష్ట్ర నాయకత్వం మెమోరాండంను సమర్పించింది. అస్సాం రైఫిల్స్ ఏక పక్షంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మణిపూర్ నుంచి అస్సాం రైఫిల్స్‌ను శాశ్వతంగా తొలగించాలని కూడా డిమాండ్ చేశారు.

లంక గ్రామాలకు రక్షణ గోడలు

- రూ.150 కోట్లతో 2 నెలల్లో నిర్మిస్తాం
- కోనసీమ జిల్లా వరద ప్రాంతాల పర్యటనలో ముఖ్యమంత్రి ప్రకటన

ప్రజాశక్తి- అమలాపురం (డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)



గురజాపులంకలో వరద బాధితులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్

లంక గ్రామాల ప్రజలను వరద నుంచి రక్షించేందుకు రూ.150 కోట్లతో రివెట్‌మెంట్ వాల్ నిర్మాణం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. లంక గ్రామాల్లో ఈ వాల్‌ను నిర్మించనున్నామని, దీనివల్ల నదీ కోతను అరికట్టడమే కాకుండా వరద నుంచి రక్షణ లభిస్తుందని అన్నారు. వీలైనంత త్వరగా ఈ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ మేరకు వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజనీర్లను ఆదేశించారు. రెండు నెలల్లోనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ముంపు గ్రామాలైన ముమ్మిడివరం మండలం గురజాపులంక, కూనలంక, లంక ఆఫ్ ఠానేలంకలో మంగళవారం ఆయన పర్యటించారు. అక్కడి వరద బాధితులతో సమావేశమయ్యారు. వరద బాధితులకు అందిన సాయం, అధికారులు స్పందించిన తీరుపై ఆరా తీశారు. అనంతరం లంక ఆఫ్ ఠానేలంక, రామాలయంపేట గ్రామాల్లో కాలినడకన పర్యటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరద బాధితులందరినీ ఆదుకుంటామన్నారు. గత ప్రభుత్వానికీ, ఈ ప్రభుత్వానికీ ఉన్న తేడాను గమనించాలని కోరారు. వరద బాధితులను ఆదుకునేందుకు కలెక్టర్లకు వారం రోజులు సమయం ఇచ్చామన్నారు. తానే స్వయంగా వచ్చి బాధితులను కలుస్తానని చెప్పానని తెలిపారు. ఆ మేరకు రెండు రోజులుగా వరద బాధితులను కలుస్తున్నానని చెప్పారు. పేదలకు సాయం అందించే విషయంలో వెనకడుగు వేయకూడదని, తక్కువ నష్టం జరిగినా రూ.10 వేలు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించానని తెలిపారు. రైతుల పేరు, విస్తీర్ణం, పంట నష్టం వివరాలు ఆర్‌బికె రికార్డుల్లో పొందుపరుస్తామన్నారు. పంట నష్టం జరిగితే వెంటనే ఆర్‌బికెలో నమోదు చేయించుకోవాలని సూచించారు. జాబితాలో ఎవరి పేరైనా లేకుంటే ఆర్‌బికెల్లో ఫిర్యాదు చేయాలని కోరారు.

ఇద్దరు చిన్నారుల వైద్యానికి సిఎం ఆర్థిక సాయం

అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారుల వైద్యానికి ముఖ్యమంత్రి జగన్ ఆర్థిక సాయం అందించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఈ

మిగతా 5లో

తుది తీర్పు మేరకే

'మెడికల్' సీట్ల భర్తీపై హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుచేసిన ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్సింగ్ (బి కేటగిరి 35 శాతం), ఎన్ఆర్ఐ (సి కేటగిరి 15 శాతం) కోటా సీట్లను భర్తీ తాము వెలువరించే తీర్పునకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. భర్తీ ప్రక్రియ నిలుపుదలకు నిరాకరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. భర్తీ ప్రక్రియ పూర్తి చేయవచ్చునంది. సీట్ల భర్తీ మాత్రం తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయంది. ప్రతివాదులైన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి, నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) కార్యదర్శి, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, వైద్య విద్య కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 22కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ప్రకటించింది. ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటు వైద్య కళాశాల కంటే సమర్థవంతంగా నిర్వహించే ప్రయత్నంలో భాగంగా విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల జిల్లాల్లో ఏర్పాటుచేసిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లను జనరల్, సెల్ఫ్‌ఫైనాన్స్, ఎన్ఆర్ఐ కోటా సీట్లుగా విభజిస్తూ ప్రభుత్వం గత నెలలో జిఓలు 107, 108 ఇచ్చింది. వీటిని సవాల్ చేస్తూ.. కోయ శిరీష (గుంటూరు) జతిన్ రాయ్ (ఏలూరు) వీణా జ్యోతిక (ఆత్మకూరు) దాఖలు చేసిన వ్యాజ్యాలను హైకోర్టు విచారణ జరిపింది.

కేంద్రం గుప్పెట్లోకి గ్రంథాలయాలు

- రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాలోకి లైబ్రరీలు
- బిల్లు తెచ్చేందుకు కేంద్రం యోచన



ఎసిబికి చిక్కిన మున్సిపల్ కమిషనర్

- రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



లంచం తీసుకుంటుండగా పట్టుబడిన సాలూరు మున్సిపల్ కమిషనర్ శంకరరావు

ప్రజాశక్తి- సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం జిల్లా సాలూరు మున్సిపల్ కమిషనర్ అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎసిబి డిఎస్‌పి రామచంద్రరావు కథనం ప్రకారం... సాలూరులోని గొర్లి వీధిలో రవ్వా బద్రినాథ్ అనే వ్యాపారి షాపింగ్ కాంప్లెక్స్ కం ఇంటిని నిర్మించుకున్నారు. ఇందుకుగానూ బివి రమణకుమార్ అలియాస్ రమణాజీతో అగ్రిమెంట్ చేసుకున్నారు. కాంప్లెక్స్ నిర్మాణం మున్సిపల్ నిబంధనలకు కొంతవిరుద్ధంగా జరిగింది. దీంతో, ఇంటి యజమానికి మున్సిపల్ అధికారులు నోటీసు జారీ చేశారు.

ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ శంకరరావును బద్రినాథ్ కలిశారు. తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు రూ.4 లక్షలు లంచం ఇవ్వాలని ఆయనను కమిషనర్ డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని, రూ.2 లక్షలు ఇస్తానని, ఇదీ కూడా ఒకేసారి ఇవ్వలేనని, రెండు విడతల్లో ఇస్తానని బద్రినాథ్ చెప్పారు. దీనికి మున్సిపల్ కమిషనర్ అంగీకరించడంతో తొలుత రూ.50 వేలను ఇటీవల ఇచ్చారు. మిగతా డబ్బులు మంగళవారం ఇస్తానని చెప్పి ఎసిబి అధికారులను సంప్రదించారు. ఈ నేపథ్యంలో కమిషనర్‌కు ఆయన ఛాంబర్‌లో రూ.1.50 లక్షలను బద్రీనాథ్ ఇచ్చారు. అదే సమయంలో ఎసిబి అధికారులు దాడి చేసి ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకొని మున్సిపల్ కమిషనర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కాగా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కమిషనర్ గతంలో అరెస్టయ్యారు. ఆ కేసు నుంచి బయటపడి నెల్లూరు కార్పొరేషన్‌లో విధుల్లో చేరారు. ఆ తర్వాత సాలూరు కమిషనర్‌గా ఈ ఏడాది జనవరిలో బదిలీపై వచ్చారు.

యుసిసి ముసాయిదా తయారీని విరమించుకోండి

- కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

లోపలి పేజీలో..

అమెరికన్ బ్యాంక్‌ల పరపతి పతనం

- 10 బ్యాంక్‌ల రేటింగ్‌కు మూడీస్ కోత
- మరిన్ని విత్త సంస్థలకు హెచ్చరిక

లోపలి పేజీలో..


'అసైన్డ్' చట్టసవరణ వద్దు

- ముగిసిన 'భూమి కోసం సమర శంఖారావం' పాదయాత్ర
- ర్యాలీ, ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

లోపలి పేజీలో..

కేంద్రంపై పోరాడి పునరావాసం నిధులు తేవాలి

మోడీ ఇవ్వకపోతే, తాను ఇవ్వలేననడం దారుణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

- సిఎం జగన్‌పై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆగ్రహం
- పోలవరంపై అఖిలపక్షం వేసి వాస్తవాలు వెల్లడించాలి
- వైసిపి, టిడిపి ఎంపిలు భజనకారులుగా మారారని వ్యాఖ్య

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వంపై పోరాడి పోలవరం పునరావాసం నిధులు తేవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సూచించారు. పునరావాసం నిధులు తేవడం చేతకాకపోతే దిగిపోవాలని, అంతేతప్ప ప్రజలను నిండా ముంచొద్దని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హితవు పలికారు. మంగళవారం నాడిక్కడ ఎపి భవన్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మాట్లాడారు. ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సిఎం.. బాధితులకు ఎలాంటి అదనపు సాయం ప్రకటించకపోవడం దారుణమన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిధులు ఇస్తేనే పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పిస్తామనడం బాధ్యతారాహిత్యమని అన్నారు. మోడీ ఇవ్వకపోతే, తాను ఇవ్వలేనని చేతులు దులుపుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.

పోలవరం నిర్మాణం బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నప్పుడు, పునరావాసం బాధ్యతను కూడా రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను పోరాడి తెచ్చుకోవాలని, లేకపోతే ప్రజలకు చెప్పి వారిని కదిలించి తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పోట్లాడితే తామంతా మద్దతు ఇస్తామని, రాష్ట్ర ప్రజలను కదిలించి, ముఖ్యమంత్రి ఢిల్లీలో ధర్నా చేయాలని అన్నారు. ఇలాంటివి చేయకుండా చేతులెత్తేయడం ప్రజలను దగా చేయటమేనని విమర్శించారు.

ప్రాజెక్టు నిర్మాణానికి, మరమ్మతులకు, కాంట్రాక్టరుకు ఇవ్వడానికి కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి, పునరావాసానికి ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. ప్రజల నుంచి భూములను రాష్ట్ర ప్రభుత్వమే సేకరించిందని, పరిహారం ఇవ్వాల్సింది కూడా రాష్ట్ర ప్రభుత్వమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వకుంటే గల్లా పట్టుకుని నిలదీయాలని, పోట్లాడాలని అన్నారు.

పునరావాసం పట్ల సిఎం తీసుకున్న వైఖరి, పోలవరాన్ని నట్టేట ముంచడమేనని అన్నారు. పోలవరం పూర్తి చేయాలని చిత్తశుద్ధి ఉంటే, పునరావాసం గత ప్రభుత్వం కంటే బాగా చేయాలని అన్నారు. కానీ గత ప్రభుత్వం కంటే దారుణంగా పునరావాసం చేసి, పోలవరం పూర్తి చేస్తామని చెప్పడం దారుణమన్నారు. దీన్ని రాజకీయ సమస్య చేసి, ప్రజలను తప్పుదోవపట్టించడమే తప్ప, పోలవరం సమస్యను పరిష్కరించే పద్ధతి ఇది కాదన్నారు. పోలవరంపై అఖిలపక్ష సమావేశం వేయాలని, అందులో వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు. డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని, గైడ్‌వాల్ కుంగిందని, కాఫర్ డ్యామ్ మునిగిపోయిందని, వీటన్నింటికీ డబ్బులు

మిగతా 5లో

సంపాదకీయం

విశృంఖల నిరంకుశత్వం

ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, సమాఖ్య విధానం పట్ల ఏమాత్రం గౌరవం లేని నిరంకుశ, మితవాద ప్రభుత్వంగా నరేంద్రమోడీ ప్రభుత్వం మరోసారి తన నిజస్వరూపాన్ని చాటుకుంది. తాజాగా పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఢిల్లీ పౌరసేవల చట్టం (జాతీయ రాజధాని ప్రాంత ప్రభుత్వ (సవరణ) చట్టం), వ్యక్తిగత డేటా బిల్లు (డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్ – 2023) ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. ఒక రాష్ట్రం హక్కులు హరిస్తుంటే వ్యతిరేకించాల్సిన రాష్ట్రంలోని అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్, తెలుగు ప్రజల ఆత్మగౌరవం పునాదిగా ఏర్పడిన టిడిపి, ఒడిశా అధికార పార్టీ బిజెడి ఈ బిల్లు ఆమోదం పొందడంలో కీలకపాత్ర పోషించడం దారుణం.

ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాన్ని రబ్బరు స్టాంపు, తోలుబొమ్మ స్థాయికి దిగజార్చాలన్న కసి, కుట్ర ఢిల్లీ పౌరసేవల బిల్లులో కనిపిస్తోంది. 2014 ఎన్నికల్లో ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర ప్రభుత్వ హోదా ఇవ్వాలని డిమాండ్ చేసిన నరేంద్రమోడీ ఏలుబడిలోనే ఆ ప్రభుత్వ అధికారాలను హరించడం గమనార్హం. శాంతిభద్రతలు, పోలీసు వ్యవస్థ, భూసంబంధ అంశాల్లో మినహా మిగతా అన్ని విషయాల్లో ప్రజల చేత ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వానికే అధికారం ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగ ధర్మాసనం విస్పష్టంగా ఇచ్చిన తీర్పును తుంగలో తొక్కింది. గత మేలో ఆర్డినెన్స్‌గా, ప్రస్తుతం చట్టంగా ఆమోదం పొందిన ఈ బిల్లు ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాన్ని కేంద్రం నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్ చేతిలో తోలుబొమ్మగా మార్చింది. ఈ చట్టం ఢిల్లీ ముఖ్యమంత్రి అధ్యక్షతన నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీని ఏర్పాటుచేస్తోంది. అథారిటీకి ముఖ్యమంత్రి అధ్యక్షత వహించినప్పటికీ, సీనియర్ బ్యూరోక్రాట్లుగా ఉన్న మరో ఇద్దరు అధికార సభ్యులు సిఎం అభిప్రాయాన్ని తోసిపుచ్చవచ్చు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు అథారిటీ సిఫార్సులను ఆమోదించాల్సిన అవసరం లేదు. వీటిని బట్టి చూస్తే ఢిల్లీ సిఎం విలువ జీరో. మంత్రిమండలి అభిప్రాయాలను కార్యదర్శులు కూడా అడ్డుకోవచ్చు. పైగా లెఫ్టినెంట్ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి, దానిమీద ఆయన నిర్ణయం తీసుకునే వీలు కల్పిస్తుంది. అంటే మంత్రి మండలి నిర్ణయాల చట్టబద్ధతను పరీక్షించే ఇన్విజిలేటర్ లేదా ఎగ్జామినర్‌గా కార్యదర్శి మారిపోతాడు. ముఖ్యమంత్రి, మంత్రిమండలి డమ్మీగా మారగా, కేంద్రం చేత నియమితుడైన లెఫ్టినెంట్ గవర్నర్ సర్వోన్నతంగా మారతారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి, మంత్రి మండలిని డమ్మీగా మార్చేసి, కేంద్రమే పాలన చేస్తే ప్రజాభీష్టానికి, ఎన్నికలకు విలువ ఏముందో మోడీ సర్కారుకే తెలియాలి. ఈ బిల్లుపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు మరింత ఘోరంగా ఉన్నాయి. 2015 తరువాత వచ్చిన సిఎంతో సమస్యలు ఉండటం వల్లే తీసుకొచ్చామంటూ పరోక్షంగా ఆప్ సిఎం కేజ్రీవాల్‌ను పేర్కొంటూ సమర్థించుకోవడం ఆయనకే చెల్లింది. ఈ 25 ఏళ్లుగా ఢిల్లీలో అధికారానికి దూరంగా ఉన్న బిజెపి దొడ్డిదారిన పాలన చేయాలనే ఆత్రమే ఈ చట్టం అన్న విమర్శలకు ఏమని సమాధానం చెప్పగలరు? ప్రజాస్వామ్యమంటే అధికార వికేంద్రీకరణే తప్ప కేంద్రీకరణ కాదన్న స్పృహ కాస్తయినా ఉంటే సమాఖ్య వ్యవస్థ హననానికి కేంద్రప్రభుత్వం పాల్పడి ఉండేది కాదు. తాజాగా రాజ్యసభలో చర్చకు టిడిపి డుమ్మా కొట్టగా, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాజును మించిన రాజభక్తిని ప్రదర్శించడం సిగ్గుచేటు. నీతిలేని పాలన నుంచి ఢిల్లీని రక్షించడానికి బిల్లుకు మద్దతు తెలుపుతున్నామని వైసిపి ప్రకటించడం మోడీ సర్కారుకు భజన చేయడమే. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల గురించి పల్లెత్తు మాట్లాడకుండా, ఢిల్లీ వంటి బిల్లుకు మద్దతు ఇచ్చి కేంద్రీకరణ, నిరంకుశత్వానికి రెండు పార్టీలు కొమ్ముకాయడం సరికాదు.

డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్ 2023పై 2018లో ముసాయిదా రూపొందించి, నివేదిక సమర్పించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.ఎన్ శ్రీకృష్ణ తాజా బిల్లు వ్యక్తిగత, ఆంతరంగిక డేటాలో ప్రభుత్వం తలదూర్చడానికి ఎక్కడ లేని అవకాశమిస్తుందని తీవ్ర విమర్శ చేశారు. డేటా గోప్యతకు సంబంధించి వ్యక్తుల స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కుకు రక్షణ ఇవ్వడం కంటే ప్రభుత్వ విశంఖల జోక్యానికి, బాధ్యుడైన అధికారి కీలుబొమ్మలా మారేందుకు దోహదం చేస్తోంది. రాజ్యాంగ సమాఖ్య సూత్రాలను ధ్వంసం చేసే కేంద్రం దుర్మార్గాలను జనం తిప్పికొట్టాలి.

మహనీయుల మాట



అఖండ ప్రజ్ఞత్వం అంటే... ఒక్క శాతం ప్రోత్సాహం, 99 శాతం చెమటోడ్చి సాధించడం.

- థామస్ అల్వా ఎడిసన్,
ప్రసిద్ధ అమెరికన్ శాస్త్రవేత్త.


Thomas A Edison

జెండా పండగ నాడు సగటు మనిషి ఆలోచనలు

సందర్భం



గుమ్మడిదల రంగారావు



సాధారణ పౌరుడు ఏమి ఆలోచిస్తాడు? మన స్వతంత్ర సమరయోధులు చేసిన త్యాగాలా? ప్రధాని చెప్తున్న ప్రగతా? దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లా? నిత్య జీవితంలో ఎదురయ్యే ఇక్కట్లా? సామాన్య మనిషి ఆశలు, ఆకాంక్షలు పాలకులకు అర్థమవుతాయా? తన అభిప్రాయాలు పాలకులకు తెలిపే అవకాశం సగటు మనిషికి వుందా? తన వేదన ఎవరికి నివేదన చేయగలడు? తన ఆవేదనను ఎవరు ఆలకిస్తారు? తన మనోవేదనను ఎవరు తీరుస్తారు?

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకునే వేళ సగటు పౌరుడి మనసులో వుండే ఆలోచనలేమిటి? సాధారణ భారతీయుడు ఈ రోజును పండగగానే చూస్తున్నాడా? మనసు నిండా దేశభక్తి నిండి వుందా? ప్రధాన మంత్రి ఎర్ర కోట నుంచి హావభావాలతో చేసే ప్రసంగం సగటు పౌరుడికి అర్థమవుతుందా లేక ఊకదంపుడు ఉపన్యాసంగానే మిగిలిపోతుందా? సగటు పౌరుడు అంటే ఎవరు? ఎవరి మొఖానా సగటు పౌరుడు అని రాసి వుండదు. మీరు, నేను అందరం సగటు పౌరులమే (పండితులైనా, పామరులైనా, కిసాన్ అయినా, జవాన్ అయినా, ఆఫీసరైనా, గుమాస్తా అయినా). సంపాదనలో తారతమ్యాలు వుండొచ్చు. జీవన విధానంలో మార్పులు వుండవచ్చు. కానీ అందరం సామాన్య మనుషులమే. అందరి ఆశలు, ఆకాంక్షలు దాదాపుగా ఒకటే. అది ఎవరి స్థాయికి తగ్గట్టు వారు మెరుగైన జీవితం కోసం పడే ఆరాటం, చేసే పోరాటం. అదే జీవన తరంగం. కొద్ది మంది ఈ పోరాటంలో నెగ్గుతారు, కోట్లాదిమంది ఈ ఆరాటంతోనే అశువులు బాస్తున్నారు.

మన దేశంలో జీవితాన్ని చాలా వరకు ప్రభుత్వమే శాసిస్తుంది. అభివృద్ధి కుంటుపడ కుండా, సంక్షేమ కార్యక్రమాలు అమలు చెయ్యటమే ప్రధాన ధ్యేయంగా చెబుతుంది ప్రభుత్వం. సంక్షేమం అంటే ప్రభుత్వానికి పెద్ద పాత్ర ఉందని అర్థం. సంక్షేమం అనగానే మనకి గుర్తొచ్చేది బడుగు బలహీన వర్గాల ప్రజలు. ప్రజలందరి సంక్షేమం ప్రభుత్వ ధ్యేయమే అయినా సంక్షేమం అనగానే సమాజంలో అట్టడుగు వర్గాల వారే మొదటి ధ్యేయం. ఈ వర్గాలవారికి కనీస అవసరాలు తీర్చుకునే శక్తి ఉండదు. ఎందుకంటే వీరు కడు పేదరికంలో బతుకు బండిని నెట్టుకొస్తుంటారు. చదువు వుండదు, ఆస్తిపాస్తులు వీరు ఎరుగరు. కడుపు నిండా తిండి, ఒంటి నిండా బట్ట, తల దాచుకోవటానికి నీడ అనేవి సమాజంలో అట్టడుగు వర్గాల వారికి నెరవేరని కనీస కోరికలు. ఏ ప్రభుత్వమైనా వీరి సంక్షేమానికే పాటుపడుతున్నామనీ, వీరి అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని చెబుతుంది. కానీ అది ఆచరణలో ఏ మాత్రం సాధ్యమైంది, ఎంత మందికి చేయూతనిచ్చింది?

స్వతంత్ర దినోత్సవం నాడు పొద్దున్నే ప్రధాన మంత్రి ఎర్ర కోట మీద నుంచి దేశ ప్రజలనుద్దేశించి రాచరికాన్ని తలపించే రీతిలో ఉపన్యసిస్తారు. దేశం సాధించిన ప్రగతి, సాధించవలసిన లక్ష్యాలు, ఎదుర్కొంటున్న సమస్యల మీద మాట్లాడతారు. తన సారథ్యంలో ప్రభుత్వం సాధించిన ఘనత గురించి గొప్పగా చెబుతారు. కానీ ఈ ఉపన్యాసంతో ఎంతమంది కనెక్ట్ అవుతారు? సాధారణ పౌరుడు ఏమి ఆలోచిస్తాడు? మన స్వతంత్ర సమరయోధులు చేసిన త్యాగాలా? ప్రధాని చెప్తున్న ప్రగతా? దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లా? నిత్య జీవితంలో ఎదురయ్యే ఇక్కట్లా? సామాన్య మనిషి ఆశలు, ఆకాంక్షలు పాలకులకు అర్థమవుతాయా? తన అభిప్రాయాలు పాలకులకు తెలిపే అవకాశం సగటు మనిషికి వుందా? తన వేదన ఎవరికి నివేదన చేయగలడు? తన ఆవేదనను ఎవరు ఆలకిస్తారు? తన మనోవేదనను ఎవరు తీరుస్తారు?

ఎర్ర కోట నుంచి ప్రధాని వల్లె వేసే గణాంకాలతో నిండిన ప్రగతి కబుర్లు, భావోద్వేగంతో చెప్పే అభివృద్ధి కథలకు, సగటు మనిషి జీవితానికి ఏమైనా సంబంధం వుందా? ప్రభుత్వ ప్రకటనల్లో, ప్రధానమంత్రి ఉపన్యాసంలో పేర్కొనే వృద్ధి రేటుతో సగటు మనిషి జీవితం మెరుగుపడిందా? ఇవి చాలామందిని వేధిస్తున్న ప్రశ్నలు. దీనికి ఎవరు సమాధానం ఇవ్వగలరు? వృద్ధి రేటు పెరగటంతో సగటు మనిషి జీవనంలో గణనీయమైన మార్పులు వచ్చాయి? ఇది చదువుకున్నవారికే అర్థంగాని ప్రశ్న.ఏమి చదివుకున్నారో చెప్పని నాయకులకు ఏం అర్థమవుతుంది వృద్ధి రేటు కథ? మనం సాధించామని చెబుతున్న ప్రగతితో సామాన్యుడిలో రేపటి గురించిన అభద్రత తగ్గిందా? మనం సాధించిన అభివృద్ధితో నేడు సగటు మనిషి అన్నంలో టొమాటో పప్పు తినగలుగుతున్నాడా? ప్రగతి అంకెలు, వృద్ధి రేటు కథలూ ప్రజలకు అర్థం కాకపోవటానికి అసలు కారణం ఆ కథలు నిజ జీవితానికి కడు దూరంగా వుండటమే!

మనం స్వతంత్ర దేశంగా అభివృద్ధి చెందలేదని కాదు ఇక్కడ వాదన. స్వతంత్రం వచ్చిన నాటికి నేటికీ మన దేశ స్థితిగతుల్లో గణనీయమైన మార్పు వచ్చిన మాట కాదనలేని నిజం. నదులకు ఆనకట్టలు కడుతున్నాము, విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాము, వ్యవసాయానికి సాగునీరు అందిస్తున్నాము. దేశంలో చాలా వరకు విద్యుత్ సదుపాయం విస్తరించింది. ఒకనాడు సంపన్నుల ఇంట వుండే వంటగ్యాస్ ఇప్పుడు అందరికీ అందుబాటులో వుంది (బండ ఖరీదు బండెడు భారంగా మారింది. అది వేరే విషయం). జాతీయ రహదారులను అభివృద్ధి చేసుకున్నాము. రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాము. రాజధాని, శతాబ్ది, వందే భారత్ లాంటి అధునాతన రైళ్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నడుపుతున్నాం. విమానాశ్రయాలు కడుతున్నాం. అంతరిక్షంలోకి విదేశాల ఉపగ్రహాలను కూడా పంపే స్థాయికి ఎదిగాం. చందమామ మీద కాలు మోపాలని ఆశపడుతున్నాం. ఇంటర్నెట్ వాడుతున్నాం, ప్రపంచంలో ఏ మూల ఏం జరుగుతున్నదో ఇట్టే తెలుసుకోగలుగుతున్నాం. నేడు ప్రపంచం మన వాణి వింటుంది. ఇది గర్వించదగ్గ ప్రగతి. సందేహం లేదు. కానీ, ఇది స్వతంత్రం వచ్చినప్పటి నుంచి అన్ని ప్రభుత్వాల సమిష్టి కృషి ఫలితం. చరిత్ర ఘనతను విస్మరించేవారు ఘనమైన చరిత్రను సృష్టించలేరన్నది చారిత్రక సత్యం.

మనం సాధించిన ప్రగతి సమాజంలోని అట్టడుగు వర్గాలైన రిక్షా కార్మికుడు, రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారి, నాలుగు ఇళ్లలో పాచి పని చేస్తే గానీ జరగుబాటు లేని 'పనిమనిషి', మురికివాడలో బతికే జీవి, రెక్కాడితేగాని డొక్కాడని వ్యవసాయ కూలీ లాంటి కోట్లాది మంది ప్రజల జీవితాలను ఏ విధంగా ప్రభావితం చేయగలిగింది? ఈ ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం లేదు. మన ప్రగతి ఫలాలు అట్టడుగు వర్గాలకు అందటం లేదన్న విషయాన్ని మనం అంగీకరించాలి. ముందు సమస్య ఉందని ఒప్పుకుంటేనేగదా సమస్యకు పరిష్కారం వెతకగలం. మనం సాధించిన అభివృద్ధి కొన్ని వర్గాలకే పరిమితమైంది. అన్ని వర్గాలవారికి ప్రగతి ఫలాలు అందించటంలో మనం విఫలమయ్యామని ఒప్పుకోవాలి. మనం మాట్లాడుకుంటున్న అట్టడుగు వర్గాల ప్రజలు వందే భారత్ రైలు ఎక్కగలరా? విమానాశ్రయం దరిదాపులకు పోగలరా? జాతీయ రహదారుల్లో కార్ల మీద తిరగగలరా? వీరికి ఆధునిక వైద్యం అందుబాటులో ఉందా? ఆధునిక విద్య అందుబాటులో ఉందా? విద్య వలన దిగువ మధ్య తరగతి వారు కొందరు మధ్య తరగతిలో కలిసిపోయారు, మధ్య తరగతివారు కొందరు ఎగువ మధ్య తరగతిలో కలిసిపోయారు, ఎగువ మధ్యతరగతి వారు కొందరు సంపన్నుల్లో కలిసిపోయారు, సంపన్నుల్లో కొందరు బ్యాంకులను మోసం చేసి దేశం వదిలి పారిపోయారు! మరి కొందరు దేశంలోనే వుండి కేంద్రంలో అధికార పార్టీలో చేరి వారి నేరాలను కడిగేసుకున్నారు! ఇదే కదా మన ప్రగతి కథ! విద్య వలన అట్టడుగు వర్గాలు ఇంకా తమ స్థితిగతులను మార్చుకోలేక పోతున్నాయి. మరి, అట్టడుగు వర్గాలకు చెందిన కోట్లాదిమంది జనులు ప్రభుత్వ ప్రగతి నివేదికలతో ఏ విధంగా కనెక్ట్ అవుతారు? అధికారులు పేదలను సంప్రదించకుండా, పేదలతో నిమిత్తం లేకుండా పేదరిక నిర్మూలన కోసం ఎక్కడో దూరాన ఏసీ గదుల్లో కూర్చొని పథకాలు రచిస్తుంటే పేదరికాన్ని ఎలా ఓడించ గలం? నిజానికి, సమాజంలో పేదరికం ఉండటం పాలకులకు అవసరం. పేదరికం ఉంటేనేగదా దానిని నిర్మూలించేది? మన పాలకులకు పేదరికాన్ని కాపాడటం చాలా అవసరం!

అట్టడుగు వర్గాలవారి అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు రూపొందించామని అదేపనిగా చెబుతారు నాయకులు, అధికారులు. కానీ ఈ పథకాలకూ వీటిని ఉద్దేశించిన ప్రజలకు మధ్య ఎంతో అంతరం వుంది. దీన్ని పూడ్చలేక పోతున్నాము. దానికి కారణం పథకాలను రూపొందించేవారికి లబ్ధిదారుల అవసరాల పట్ల అవగాహన లేకపోవటమే. మన సమస్యలు అన్నిటికీ ఐఎఎస్ అధికారులే పరిష్కారం అనే ఆలోచన నుంచి బయటపడలేకపోతున్నాము. దానికి సమాధానం లేక విరుగుడుగా ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు వెదజల్లుతున్నాము. కొన్ని రాష్ట్రాల చట్ట సభలకు మరి కొద్ది రోజుల్లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఆ తరువాత వచ్చే ఏడాది మొదటి సగభాగంలో పార్లమెంటుకు కూడా ఎన్నికలు వస్తాయి. డబ్బు పంపిణీ చేసే పండగ సీజను. ఇది హామీల సీజను కూడా. నది లేకపోయినా బ్రిడ్జి నిర్మిస్తామని హామీలు గుప్పించేవి రాబోయే రోజులు. పోయినసారి ఎన్నికలప్పుడు ఏం హామీలిచ్చారు, వాటిని ఏ మేరకు నెరవేర్చారు, ఇప్పుడు ఇచ్చే హామీలు నెరవేర్చటానికి వీలైనవా లేక స్వర్గానికి నిచ్చెనలేసే విధంగా ఉన్నాయా అని నిశితంగా పరిశీలించాల్సిన చైతన్యం మనకు ఉండాల్సిన సమయమిది. అందుకే ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమయం ప్రజలకు చాలా కీలకం. ఇప్పుడు గనక మనం జాగ్రత్త వహించకపోతే వచ్చే ఐదేళ్ళు నోరు మెదిపే అవకాశముండదు. ఎందుకంటే మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలు నేతలను నిలదీసి అడగగలిగేది ఎన్నికలప్పుడే. ఓటును అమ్ముకుంటే నిలదీసి అడిగే నైతిక హక్కు వుండదు. ఐదు వేళ్లతో ఐదేళ్ల నోటికి తాళం వేసుకోవాల్సిందే!

మనకి ప్రజాస్వామ్యం కొత్త. రాజ్యాంగ పాలన కొత్త. రాజ్యాంగం, హక్కులు, బాధ్యతల గురించి లోతైన అవగాహన లేదు మనకు. పుట్టుకతోనే వివక్షను వారసత్వపు బహుమతిగా పొందే వ్యవస్థ మనది. మనిషిని మనిషిగా గౌరవించి, బాధ్యతలు తెలుసుకొని, హక్కులను, కాపాడుకుంటామో అప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన పండగ. మన ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అంతరం తగ్గుతుంది. అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయి. ప్రజలు స్వతంత్ర దినోత్సవ వేడుకలు, గణతంత్ర దినోత్సవ వేడుకలకు నిండు మనసుతో సులభంగా కనెక్ట్ అవుతారు. మనలో జాతీయతా వాదాన్ని బలపరచటానికి, ప్రపంచంలో మనం గౌరవప్రదమైన స్థానం పొందటానికి ఇదే సరైన మార్గం. అంతేగానీ ప్రజలు పేదరికం నుంచి బయట పడాలని కోరుతుంటే పాలకులేమో అయోధ్యలో మందిరం నిర్మిస్తాం, ఆర్టికల్ 370ని రద్దు చేశాం, ఏకరూప పౌర స్మృతిని తెస్తాం, హిందీని బలవంతంగా నేర్పుతాం...అనేది వితండవాదం. ఇవి అనుత్పాదక అంశాలు. వీటివలన ఎవరి కడుపూ నిండదు. ఈ ఉన్మాదంతో జాతీయతా భావం బలపడుతుందా, పలచబడుతుందా? ఆలోచించవలసిన అవసరం ఎంతైనా వుంది. భారత్ అనేది ఒక వైవిధ్యభరితమైన భావన. విభిన్న జీవన విధానాలు విలసిల్లుతున్న ఈ భరత భూమి మీద రాజ్య విధానం ఎవరి గౌరవానికీ భంగం కలిగేలా వుండదు అన్న విశ్వాసాన్ని ప్రజల్లో నింపడం చాలా అవసరం. అప్పుడే మనం ఒక జాతిగా ఐకమత్యంతో ముందుకెళతాం. కానీ పాలకులు దీన్ని అర్థం చేసుకోవటం లేదు. ఈ సత్యాన్ని అర్థం చేసుకోవటంలోనే వుంది ప్రజాస్వామ్యానికి అర్థం, పరమార్థం. అప్పుడే మువ్వన్నెల జండాకి గౌరవం, జాతికి గర్వం. ఇదే నేడు సగటు మనిషి మదిలో మెదిలే ఆలోచన. ఈ వ్యాసానికి నేపథ్యం కూడా సగటు మనిషి ఆలోచనలే.

(వ్యాసకర్త లోక్‌సభ సచివాలయంలో మాజీ డైరెక్టర్)

★

ఆగస్టు 9 ఆదివాసీ 'హక్కుల' దినోత్సవం కావాలి

విశ్లేషణ



కిల్లో సురేంద్ర

ఆదివాసీల హక్కులను గుర్తించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం నిరాకరిస్తున్నది. అడవులపై వారు సాధించుకున్న హక్కులను తొలగించి కార్పొరేట్ కంపెనీలకు ప్రవేశం కల్పించింది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఆదివాసీలు తిండి కోసం వలసలు పోవాల్సి వస్తోంది. వీరు విద్య, వైద్య సదుపాయాలు, ఉపాధి లేక దుర్భర జీవితం అనుభవిస్తున్నారు. అందుకే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ హక్కుల దినోత్సవంగా జరిపి విజయవంతం చెయ్యాలని ఆదివాసీ గిరిజన సంఘం పిలుపు ఇస్తున్నది.



ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాలలో సుమారు 40 కోట్ల మంది ఆదివాసీలు జీవిస్తున్నారు. ఆదివాసీల హక్కులను గుర్తించాలని 1994 ఆగస్టు 9న ఐక్యరాజ్య సమితి డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచం నలుమూలలా ఆగస్టు 9వ తేదీన ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. ఆదివాసీల హక్కులను గుర్తించడానికి మాత్రం ప్రభుత్వాలు నేటికీ నిరాకరిస్తున్నాయి. భారత దేశంలో 10 కోట్ల మంది ఆదివాసీ ప్రజలు జీవిస్తున్నారు. 700 వందల ఆదివాసీ, 75 ఆదిమ జాతి తెగల హక్కులను గుర్తించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం నిరాకరిస్తున్నది. అడవులపై వారు సాధించుకున్న హక్కులను తొలగించి కార్పొరేట్ కంపెనీలకు ప్రవేశం కల్పించింది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఆదివాసీలు తిండి కోసం వలసలు పోవాల్సి వస్తోంది. వీరు విద్య, వైద్య సదుపాయాలు, ఉపాధి లేక దుర్భర జీవితం అనుభవిస్తున్నారు. అందుకే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ హక్కుల దినోత్సవంగా జరిపి విజయవంతం చెయ్యాలని ఆదివాసీ గిరిజన సంఘం పిలుపు ఇస్తున్నది.

ఆదివాసీ ప్రాంత అడవులు కార్పొరేట్ పరం

భారత రాజ్యాంగం 5, 6 షెడ్యూల్ ప్రాంత అడవులలో నివసిస్తున్న ఆదివాసీలకు అక్కడి సహజ వనరులపై హక్కు కల్పించింది. ఆదివాసీలకు, గ్రామ సభలకు సర్వ అధికారాలు కల్పించింది. అయితే ఆదివాసీ ప్రాంతంలో ఉన్న అపారమైన సహజ వనరులను బడా కంపెనీలకు ధారాదత్తం చెయ్యడానికి, ఆదివాసీ ప్రాంత అడవులను అదానీ, అంబానీ పరం చేయడానికి, విలువైన బొగ్గు, బాక్సైట్, కాల్సైట్, లేటరైట్, మాంగనీస్, యురేనియం, గ్రానైట్, ఐరన్ ఓర్, వన మూలికలు, వృక్ష జంతు సంపదను ప్రైవేట్ బడా సంస్థలకు అప్పజెప్పడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం చెయ్యని ప్రయత్నం లేదు. ఆదివాసీల అభిప్రాయాలు, ప్రతిపక్ష పార్టీల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకుంది. ఆదివాసీ ప్రాంతంలో ప్రవేట్ బడా సంస్థల ప్రవేశానికి తలుపులు బార్లా తెరిచింది. ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసీలకు అడవులపై ఉన్న హక్కులను తొలగించింది. దీనివలన ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఇప్పటివరకూ ఆదివాసీలు సహజ సిద్ధంగా అటవీ ఫలసాయం పొందేవారు. ఇప్పుడది నేరం అవుతుంది. ఆదివాసీల అడవులు, భూమి, సహజ వనరులకు రక్షణగా ఉన్న గ్రామసభకు అటవీ హక్కులు, 1/70 తదితర చట్టాల అధికారాలు లేకుండా చేసింది. తక్షణమే ఈ సవరణ చట్టాన్ని రద్దు చేసి ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసీలకు అడవులు, భూమి, సహజ వనరులపై హక్కులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

జీవో నెం 3 అమలు చెయ్యాలి

ఆదివాసీ ప్రాంత గిరిజన హక్కులు, చట్టాల అమలుకు రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్లకు భారత రాజ్యాంగం విస్తృతమైన అధికారాలు కల్పించింది. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్ కల్పిస్తున్న జీవో 3 అమలు చేసి 20 రకాల విభాగాలలో ఉపాధి కల్పించింది. అంతటి కీలకమైన జీవో నంబర్ 3ను సుప్రీంకోర్టు రద్దు చేయడంతో ఆదివాసీ ప్రాంతంలో రిజర్వేషన్ ప్రశ్నార్థకంగా మారింది. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన రిజర్వేషన్లు, హక్కులను రద్దు చేసినట్లయింది. గిరిజనేతర జాతులైన బోయ వాల్మీకులకు ఆదివాసీలుగా గుర్తింపు కల్పించి రాజకీయ లబ్ధి పొందేందుకు కేంద్ర బిజెపి, రాష్ట్ర వైసిపి ప్రయత్నిస్తున్నాయి. ఆదివాసీ ప్రాంత అడవులు, సహజ వనరులను బడా కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నాయి. తక్షణమే జీవో నంబర్ 3 అమలుకు చర్యలు తీసుకోవాలి. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

పోలవరం నిర్వాసితులకు, వరద బాధితులకు సహాయక చర్యలు

గత సంవత్సరం జులై 11న వచ్చిన గోదావరి వరద వల్ల అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలకు చెందిన కూనవరం, వరరామచంద్రాపురం, దేవీపట్నం, ఎటపాక, చింతూరు, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లోని 200 గ్రామాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. వంద రోజులపాటు ఈ గ్రామాలు వరద నీటిలో ఉన్నాయి. పోలవరం వద్ద కాఫర్ డ్యామ్ నిర్మాణం వల్ల నీరు వెనక్కి తన్ని ఈ జల ప్రళయం సంభవించింది. ఈ మండలాల్లోని ఊళ్ళకు ఊళ్ళు నీట మునిగిపోయాయి. వేలాది కుటుంబాలవారు కొండలు, గుట్టలు ఎక్కి వారాల తరబడి అక్కడే నానా అగచాట్లు పడ్డారు. రెండు నెలల తర్వాత గ్రామాలకు చేరుకున్నారు. అదే పరిస్థితి నేటి వరదల సమయంలో మరలా పునరావృతం అయ్యింది.

గత వారం రోజులుగా మునక మండలాల గ్రామాలు గోదావరి, శబరి నదుల వరద వల్ల జల దిగ్బంధనంలో ఉన్నాయి. వరద ముంపు సమస్యపై సత్వరం ప్రభుత్వం స్పందించాలి. ముందస్తు చర్యలు తీసుకోవాలి.

1. గోదావరి వరద ముందస్తు చర్యలు సత్వరం తీసుకోవాలి. 2. వరద బాధితులకు నిత్యావసర సరుకులు వెంటనే అందించాలి. 3. వరద గ్రామాల నుండి బాధితులను తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేయాలి. పడవలు, లాంచీలు సిద్ధం చేయాలి. 4. వరద బాధిత గ్రామాల ప్రజలు తాత్కాలిక గుడారాలు నిర్మించుకోవడానికి ప్రతి కుటుంబానికి టార్పాలిన్లు ఇవ్వాలి. 5. ప్రత్యామ్నాయ రహదారులను పునరుద్ధరించాలి. రోడ్లను మరమ్మతు చేయాలి. 6. పాఠశాలలు మూత పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. 7. చింతూరులో ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసరును వెంటనే నియమించాలి.

షెడ్యూల్ ప్రాంతంలో నాన్ షెడ్యూల్ ఆదివాసీ గ్రామాలు కలపాలి

రాష్ట్ర వ్యాప్తంగా 1500 ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో కలపాలి. షెడ్యూల్ ప్రాంతంలో లేనందున అక్కడ నివసిస్తున్న ఆదివాసీల భూములు, అడవులకు రక్షణ లేదు. గిరిజనేతర పెత్తందారులు, మైనింగ్ మాఫియా మధ్య ఆదివాసీలు నలిగిపోతున్నారు. ఐటిడిఏ పర్యవేక్షణ, పథకాలు, నిధులు అందక...ఆదివాసీ గ్రామాలకు విద్య, వైద్యం ఉపాధి, మంచి నీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు అందు బాటులో లేక...బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. తక్షణమే నాన్ షెడ్యూల్ ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో కలపాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలి.

యుసిసి ని వ్యతిరేకిద్దాం

రాజ్యాంగం ఆదివాసీలకు ప్రత్యేక శాసనాలు చేసింది. వారి సంస్కృతి, ఆచారాలను గుర్తించింది. అయితే కేంద్ర బిజెపి ఆదివాసీలపై హిందూ భావజాలాన్ని రుద్దేందుకు, ఆదివాసీల ప్రత్యేక శాసనాలు, సంస్కృతి ఆచారాలు తొలగించేందుకు ఏకరూప పౌర స్మృతి (యుసిసి)ని అమలు చేయాలని చేస్తున్నది. ఆదివాసీ ప్రాంతంలో యుసిసి అమలును వ్యతిరేకించాలని ఆదివాసీ గిరిజన సంఘం పిలుపు ఇస్తున్నది.

/ వ్యాసకర్త ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

★

జనవాక్యం

సెక్యులరిజాన్ని మరుస్తున్న ప్రభుత్వాలు

భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న ఆచారాలు కలిగిన మన దేశానికి లౌకిక వాదమే తప్పనిసరి. ప్రభుత్వ కార్యక్రమాలలో మత పరమైన ఆచారాలు పాటించకూడదు. సెక్యులరిజం అర్థం కూడా అదే! ఇటీవల మన ముఖ్యమంత్రి విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో పుజారి మంత్రాల మధ్య టెంకాయ కొట్టారు. ఇది తాను ముఖ్యమంత్రిగా చేసిన ప్రమాణానికి విరుద్ధం. ప్రభుత్వపరంగా, అధికారికంగా ఇలాంటి మతపరమైన వాటిని పాటించటం రాజ్యాంగ విరుద్ధం. వ్యక్తిగతంగా పాటించ వలసిన భక్తిని ఇలా ప్రభుత్వపరం చెయ్యకూడదు. అడిగితే కేసులు. జైళ్ళు. ఎటు పోతున్నాం మనం? ఈ మధ్య ప్రధాని కూడా నుతన పార్లమెంటు భవనం శంకుస్థాపన సమయంలో లౌకికవాదాన్ని పక్కనపెట్టి బేతాళ మాంత్రికులను పార్లమెంటు భవనంలోకి రప్పించారు. 140 కోట్ల దేశ ప్రజలకు అధిపతి అయిన ప్రధాని మోడీ ఆ విధంగా సన్యాసులకు అదీ పార్లమెంటు భవనంలో సాష్టాంగపడటం దేశ ప్రజలను అవమాన పరచటమే! ప్రశ్నించేతత్వము, శాస్త్రీయ పరిశీలన, మానవ వాదము పెంచటం ప్రతి పౌరుని బాధ్యత–అన్న రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో కూడా దేవుని బొమ్మలు, గోడలకు దేవుళ్ల పట్టాలు, బీరువాలకు అరచేతి ముద్రలు ఎటు పోతున్నాం! ప్రభుత్వ కార్యలయాలలో మతపరమైన కార్యక్రమాలు నిలిపివేసి, బొమ్మలు తీసేసి, రాజ్యాంగంలో రాసుకున్న సెక్యులరిజాన్ని కాపాడినట్లైతే ప్రజలకు మంచి సందేశం ఇచ్చినట్లు అవుతుంది.

– నార్నె వెంకట సుబ్బయ్య,
ఎ.పి హేతువాద సంఘం అధ్యక్షుడు.

★

సూర్యనారాయణ బెయిల్ డిస్మిస్

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగి కెఆర్ సూర్యనారాయణ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు రూ.వందల కోట్ల మేరకు నష్టం కలిగించారని ఆయనపై నమోదు చేసిన కేసులో బెయిల్ ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు.

గ్యారంటీ రుణాల్లో
ఎస్‌పిడిసిఎల్‌దే అగ్రస్థానం

మార్చి నాటికి 35,337 కోట్ల రుణం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ రుణాలకు ఇచ్చే గ్యారంటీలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. వీటికి అదనంగా గ్యారంటీతేతర రుణాలు కూడా అదే స్థాయిలో పెరగడంతో ప్రభుత్వ రంగ సంస్థలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. తాజాగా ఆర్థికశాఖ తయారుచేసిన గణాంకాల మేరకు మొత్తం గ్యారంటీ, నాన్ గ్యారంటీ రుణాలు 2.33 లక్షల కోట్ల వరకు చేరిపోయినట్లు కనిపిస్తోంది.

ఇందులో గ్యారంటీ రుణాలు రూ. 1.51 లక్షల కోట్ల వరకు ఉండగా, నాన్ గ్యారంటీ రుణాలు రూ. 82 వేల కోట్లుగా ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలతో తీసుకున్న రుణాల విభాగంలో విద్యుత్ శాఖలదే అగ్రస్థానంలో ఉన్నాయి. ఇందులో దక్షిణాది పవర్ డిస్కామ్ అగ్ర స్థానంలో ఉంది. ఈ సంస్థ ఏకంగా 35,337 కోట్ల రూపాయలు రుణంగా తీసుకుంది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ రూ. 12,388 కోట్లు రుణంగా తీసుకుంది. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ 30,100 కోట్లతో రెండో స్థానంలో ఉండగా, రాష్ట్రాభివృద్ధి సంస్థ 21,450 కోట్లు, బెవరేజ్ కార్పొరేషన్ 12,483 కోట్లు, జలవనరుల అభివృద్ధి సంస్థ 8,984 కోట్ల రూపాయలను రుణంగా సేకరించాయి. ఇదే సమయంలో టిడ్కో, రహదారి అభివృద్ధి సంస్థ, మార్క్‌ఫెడ్ వంటి సంస్థలు కూడా భారీగానే రుణాలు తీసుకున్నాయి. నాన్ గ్యారంటీ విభాగంలో కూడా ఇప్పటివరకు సాధారణ ప్రజలకు, కొంతమంది అధికారులకు కూడా తెలియని విద్యుత్ అభివృద్ధి కంపెనీ లిమిటెడ్ పేరిట రూ. 18,945 కోట్లు రుణంగా తీసుకోగా, సదరన్ డిస్కామ్ మరో 14,127 కోట్లు, తూర్పు డిస్కామ్ 7,912 కోట్లు, సెంట్రల్ డిస్కామ్ 9,216 కోట్లు రుణాలు సేకరించాయి. ఎపి ట్రాన్స్‌కో కూడా మరో 5,916 కోట్లు సేకరించింది.

గ్యారంటీ, నాన్ గ్యారంటీ రుణాల వివరాలు

సంస్థ	గ్యారంటీతో	నాన్‌గ్యారంటీతో
ఎస్‌పిడిసిఎల్	35,337	14,127
పవర్ ఫైనాన్స్	12,388	---
ఇపిడిసిఎల్	---	7,912
సిపిడిసిఎల్	---	9,216
విద్యుదాభివృద్ధి	---	18,945
ఎపి ట్రాన్స్‌కో	---	5,916
ఎపిఎస్‌ఐడిసి	21,450	---
సివిల్ సప్లయిస్	30,100	---
బెవరేజ్ సంస్థ	12,483	---
రోడ్ల అభివృద్ధి	5,223	---
జల అభివృద్ధి	8,984	---

హైదరాబాద్ ఐఐటిలో
విద్యార్థిని ఆత్మహత్య

- బాసర ట్రిపుల్ ఐటిలో మరో విద్యార్థి..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు ఐఐటిహైదరాబాద్, బాసర ట్రిపుల్ ఐటిలో మంగళవారం జరిగాయి. ఈ రెండు క్యాంపస్‌ల్లో మూడు నెలల్లో సుమారు పది మంది విద్యార్థులు ఆత్మహత్య పాల్పడటం రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టిస్తోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఐఐటి హైదరాబాద్‌లో ఒడిశాకు చెందిన విద్యార్థిని మమితానాయక్(21) ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. సోమవారం రాత్రి హాస్టల్ లో సూసైడ్ లెటర్ రాసి క్యాంపస్‌లోనే ఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నారు. సూసైడ్‌నోట్‌లో ఉన్న విషయాలను మీడియాకు వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. కాగా, జూన్ నెలలో కార్తీక్ అనే విద్యార్థి క్యాంపస్ నుంచి బయటికెళ్లి విశాఖ బీచ్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. చదువుల్లో రాణించలేకపోతున్నామనే ఆత్మనూన్యతాభావంతోనే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్టు గతంలో జిల్లా ఎస్‌పి రమణకుమార్ మీడియాకు వెల్లడించారు.

నిర్మల్ జిల్లా బాసర ఆర్‌జియుకెటిలో పియుసి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభానికి ముందే సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన జాదవ్ బబ్లూ(15) హాస్టల్ గదిలో ఉరేసుకున్నారు. గమనించిన విద్యార్థులు యూనివర్సిటీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని వైద్యులు నిర్మల్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందినట్టు పరీక్షించిన వైద్యులు తెలిపారు. తరగతుల ప్రారంభం కాకముందే విద్యార్థి మానసిక ఒత్తిడికి గురైనట్టు యూనివర్సిటీ అధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. నిర్మల్ ఆస్పత్రి వద్ద విద్యార్థి మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు.



జాదవ్ బబ్లూ

పేదల కష్టాలు కనిపించలేదా?

- కోవిడ్ సమయంలో ఛిద్రమైన బతుకుల సంగతేమిటి?
- 'పేదరికం'పై వాస్తవాలను విస్మరించిన నీతి ఆయోగ్



న్యూఢిల్లీ : దేశంలో పేదరికం తగ్గిపోయిందా? అవునట. నీతి ఆయోగ్ గత నెలలో విడుదల చేసిన నివేదిక ప్రకారం 2015-16లో 24.85 శాతంగా ఉన్న పేదరికం 2019-21 నాటికి గణనీయంగా... అంటే 14.96 శాతానికి తగ్గిపోయిందట. అయితే గత కొన్ని సంవత్సరాలుగా వివిధ సంస్థలు విడుదల చేస్తున్న నివేదికలను, గణాంకాలను పరిశీలిస్తే నీతి ఆయోగ్ నివేదికపై అనుమానాలు తలెత్తడం సహజం. పైగా నిటి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ఏం చెప్పిందంటే అత్యంత నిరుపేద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్‌లో కూడా పేదరికం తగ్గిపోయిందట.

ఈ నివేదిక ప్రకారం గడచిన ఐదు సంవత్సరాలలో దేశంలోని 13.5 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. ఇదే నిజమైతే 2030 నాటికి నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యం దిశగా దేశం సాగుతున్నట్లే. పురుషులు, మహిళలు, చిన్నారులు... వారు ఏ వయసువారైనప్పటికీ ప్రజానీకంలో సగం మందిని 2030 నాటికి పేదరికం నుంచి గట్టెక్కించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి కోవిడ్ కష్టకాలంలో ప్రజల ఆర్థిక స్థితిగతులు చిన్నాభిన్నమై పోయాయి. కోవిడ్ మహమ్మారి ప్రభావం తగ్గిన తర్వాత వారు మళ్లీ పట్టణాలు, నగరాలకు చేరుకొని జీవనోపాధి కోసం ప్రయత్నించారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే పేదల బతుకులు ఛిద్రమైన ఆ సమయంలో సైతం దేశంలో పేదరికం తగ్గిందని నీతి ఆయోగ్ చెబుతోంది.

ఎలా నిర్ణయిస్తారు?

ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు అనే మూడు అంశాలను ఆధారంగా చేసుకొని పేదరిక సూచికను రూపొందిస్తారు. ఈ మూడింటికి సమాన ప్రాధాన్యత ఇస్తారు. ఈ మూడు అంశాలను తిరిగి 12 సూచికలుగా విభజిస్తారు. వీటిలో మూడు ఆరోగ్యానికి, రెండు విద్యకు, ఏడు జీవన ప్రమాణాలకు సంబంధించినవి. కోవిడ్ రాక ముందే అంటే 2019-20లోనే 70% సమాచారాన్ని సేకరించామని నిటి ఆయోగ్ తెలిపింది. ఇదే నిజమైతే 2019-20 సమాచారంతో 2015-16 సమాచారాన్ని పోల్చి చూడాల్సింది. కానీ మరి ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైన అసాధారణ కాలంతో ఎందుకు పోల్చారు? అధికారిక గణాంకాల ప్రకారమే 2019-20లో ఉన్న జీడీపీ (4.8 శాతం) 2022-23 నాటికి కానీ తిరిగి ఆ స్థాయికి చేరుకోదు. అంటే మూడు సంవత్సరాల అభివృద్ధిని దేశం కోల్పోయింది. ఆర్థికాభివృద్ధి పది శాతం పడిపోయింది. కోవిడ్ ప్రభావం తగ్గిపోయిన తర్వాత సంఘటిత రంగం సంక్షోభం నుంచి కోలుకుంది. కానీ పేదలు ఎక్కువగా పని చేసే అసంఘటిత రంగం మాత్రం నిదానంగా కోలుకుంటోంది. అయితే ఈ వాస్తవాన్ని నీతి ఆయోగ్ విస్మరించింది.

కోవిడ్ సమయంలో...

2020-21కి సంబంధించిన సమాచారాన్ని 2020 జనవరి నుంచి 2021 ఏప్రిల్ మధ్యకాలంలో సేకరించారు. ఈ సమయంలోనే కోవిడ్ మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేసింది. ఈ కాలంలోనే పేదలు పెద్ద ఎత్తున పట్టణాలు, నగరాల నుంచి గ్రామాలకు వలస పోయారు. ప్రజలు అనారోగ్య కారణాలతో వైద్యం పైన ఎక్కువ సొమ్మును ఖర్చు చేయాల్సి వచ్చింది. కోవిడ్ కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. లాక్‌డౌన్‌తో చిన్న చిన్న వ్యాపారాలు మూతపడ్డాయి. కొన్ని ఇప్పటికీ ప్రారంభం కాని పరిస్థితి. కొందరైతే వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి వ్యాపారాలు మొదలు పెట్టారు. పరిశ్రమలు మూతపడడం అంటే యజమానులే కాదు వాటిలో పని చేసే కార్మికులు కూడా ఉపాధి కోల్పోయినట్లే. ధనికులైనా, పేదలైనా విద్యార్థుల చదువులు అటకెక్కాయి. విద్యా సంస్థలను మూసేశారు. ఆన్‌లైన్ క్లాసులతో నెట్టుకొచ్చారు. కానీ అవి పేద విద్యార్థులకు అందుబాటులో లేకుండా పోయాయి. గ్రామీణ ప్రాంతాలకు తల్లిదండ్రులతో పాటే వలస పోయిన విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఒక్క మాటలో చెప్పాలంటే 2020-21లో పేదల ఆదాయాలు, ఉపాధి, విద్య, ఆరోగ్య ప్రమాణాలకు గట్టి విఘాతం ఏర్పడింది.

అంచనాలలో లోపాలు

నీతి ఆయోగ్ నివేదిక విశ్వసనీయతపై ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యులు సైతం అనుమానాలు వ్యక్తం చేశారు. 2011 నాటి జనగణనకు సంబంధించిన నమూనాలలో ఇటీవల చేసిన ప్రధాన మార్పులను ఈ నివేదిక పట్టించుకోలేదని వారు ఎత్తిచూపారు. పైగా 2012 తర్వాత ప్రభుత్వం వినియోగ సర్వే చేపట్టలేదు. దీనివల్ల ప్రభుత్వం పేదరికాన్ని సరిగా అంచనా వేయలేకపోయింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన 28 కోట్ల మంది కార్మికులలో 94 శాతం మంది తమ నెలసరి వేతనం పది వేల రూపాయల కంటే తక్కువేనని డిక్లరేషన్ ఇచ్చారు. అంటే అసంఘటిత రంగంలో పని చేస్తున్న చాలా మంది కార్మికులు దారిద్ర్య రేఖకు సమీపంలోనే ఉన్నారని అర్థమవుతుంది. ఆరోగ్యం, విద్య సూచికలలోనే కాదు... అనేక ఇతర అంశాలలో కూడా కోవిడ్ కాలంలో పేదల బతుకులు చిన్నాభిన్నమైపోయాయి.

పునరావాసం నిధులు తేవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉంటాయని, పునరావాసానికి మాత్రం డబ్బులు రావా? అని ప్రశ్నించారు.

వైసిపి, టిడిపి ఎంపిలు పోలవరం పునరావాసంపై మాట్లాడటం లేదు

పార్లమెంటులో వైసిపి, టిడిపి రెండింటిలో ఒక్క పార్టీ కూడా పోలవరం పునరావాసం గురించి మాట్లాడలేదని, వందల మంది వచ్చి ఢిల్లీలో ధర్నా చేస్తే ఈ పార్టీలకు పట్టదా? అని ప్రశ్నించారు. పార్లమెంటులో కూర్చొని మోడీకి భజన చేస్తున్నారా? అని ఆగ్రహించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతామని చెప్పుకుంటూనే వైసిపి, టిడిపి ఎంపిలు రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారని అన్నారు. ఎంపిలు మోడీ చేయి ఎత్తమంటే ఎత్తడం, దించమంటే దించడమేనా మీ పని అని దుయ్యబట్టారు. ఒక రాష్ట్రం హక్కులు హరిస్తూ, ఎన్నికైన ముఖ్యమంత్రిని అధికారులకు జవాబుదారీ చేసిన బిల్లుకు మద్దతు ఇచ్చిన ఎంపిలకు సిగ్గుండాలని అన్నారు. ఇలాంటి బిల్లుతో ఎన్నికైన ప్రభుత్వానికి విలువేముందని, ఈ రోజు ఢిల్లీ, రేపు ఎపి అవ్వచ్చని పేర్కొన్నారు. ఇప్పుడు ఢిల్లీకి మద్దతు ఇచ్చిన వాళ్ళు, రేపు ఎపి హక్కులను లాక్కుంటే చూస్తూ ఊరుకుంటారని విమర్శించారు. ఇప్పటికే ప్రత్యేక హోదా, విభజన హామీల గురించి మాట్లాడకుండా, మరోవైపు ఢిల్లీ వంటి బిల్లుకు మద్దతు ఇచ్చి కేంద్రీకరణ, నిరంకుశత్వానికి కారణమవుతున్నారని విమర్శించారు.

లంక గ్రామాలకు రక్షణ గోడలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని నిర్వహించారు. కొవ్వూరు మండలం సీతంపేటకు చెందిన బాలిక లక్ష్మీ రేణుక కొంతకాలంగా ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో కుమార్తెకు వైద్యం అందించలేక ఆమె తల్లిదండ్రులు నాగలక్ష్మి, గోవింద్ నిస్సాహాయ స్థితిలో ఉన్నారు. గోపాలపురం భీమోలుకి చెందిన ఐదేళ్ల చిన్నారి జి.గుబ్బాలయ్య తలసేమియాతో బాధపడుతున్నారు. రోజువారీ కూలీ కావడంతో చిన్నారికి వైద్యం చేయించలేకపోతున్నామని ఆ బాలిక తల్లి నాగలక్ష్మి వాపోయారు. జిల్లాకు వచ్చిన సిఎంను కలిసి ఈ మేరకు తమ బాధలను ఏకరువుపెట్టారు. దీనిపై స్పందించిన సిఎం... వెంటనే ఒక్కొక్కరికీ రూ.లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు.

డిమాండ్లకు 'మహా' సర్కారు ఓకే

- ప్రయివేటు బస్సు డ్రైవర్ల సమ్మె విరమణ

ముంబయి : మహారాష్ట్రలో బహన్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్ (బెస్ట్) ప్రయివేటు బస్సు డ్రైవర్ల సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. జీతాల పెంపుతో పాటు ఇతర డిమాండ్లను నెరవేరుస్తామని సీఎం ఏక్‌నాథ్ షిండే హామీ ఇవ్వటంతో బెస్ట్‌లోని ప్రయివేటు బస్సు ఆపరేటర్ల ఉద్యోగులు తమ ఆందోళనను విరమిస్తున్నట్టు ప్రకటించారు. 'బెస్ట్' లీజుకు తీసుకున్న 1,600 బస్సుల్లో 551 బస్సులు రోడ్లపైకి వెళ్లాయి. ఆందోళనలో భాగంగా ఏడో రోజు సమ్మెలో కార్మికులు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. తమ ప్రతినిధి బృందం సోమవారం అర్ధరాత్రి తర్వాత సీఎం షిండేతో సమావేశమైందని కాంట్రాక్టు ఉద్యోగుల ప్రతినిధి ఆజాద్ తెలిపారు. ఆందోళన చేస్తున్న ఉద్యోగుల డిమాండ్లను నెరవేరుస్తామని షిండే హామీ ఇచ్చినట్టు చెప్పారు. " జీతాల పెంపుదల, బోనస్, లీవ్‌లు, ఉచిత బస్ రైడ్‌ల గురించి మా ప్రాథమిక డిమాండ్లు ఆమోదించబడ్డాయి. అందుకే సమ్మె విరమించాం" అని ప్రయివేటు బస్సు ఆపరేటర్ల ఉద్యోగుల బృందం సమన్వయకర్త వికాస్ ఖర్మలే తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో దారుణం

- రేవాలో ఇద్దరు బాలికలపై సామూహిక లైంగికదాడి

భోపాల్ : బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో దారుణం చోటు చేసుకున్నది. రేవా జిల్లాలో ఇద్దరు బాలికలపై సామూహిక లైంగికదాడి జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారటంతో రంగంలోకి దిగిన పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. 25 రోజుల క్రితం హనుమాన పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో బయటకు రావటంతో ఇది వెలుగులోకి వచ్చింది. లైంగికదాడి బాధితులు 14, 16 ఏండ్ల వయసు వారని అధికారులు తెలిపారు. అడవిలో మేత కోసం మేకలను తీసుకువెళ్లారని తెలిపారు. ఆ సమయంలో అక్కడ తిరుగుతున్న కొందరు వ్యక్తులు బాలికలపై లైంగికదాడి చేసి వీడియో చిత్రీకరించారని అధికారి వివరించారు. " ఈ ఘటన గురించి బాలికలు ఎవరికైనా చెబితే వీడియోను సోషల్ మీడియాలో పెడతామని నిందితులు బాధితులను బెదిరించారు. వీడియో సోషల్ మీడియాలో కనిపించడంతో, పోలీసులు దర్యాప్తు ప్రారంభించి బాధితులను కనుగొన్నారు. నిందితులు తమను బెదిరించడంతో భయపడ్డామనీ, అందుకే ఈ విషయమై ఫిర్యాదు చేయలేదని బాలికలు పోలీసులకు తెలిపారు. బాధితులు, వారి కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఏడుగురిపై కేసు నమోదు చేశారు. వారిలో ఐదుగురిని అరెస్టు చేశాం.మరో ఇద్దరి కోసం గాలిస్తున్నాం" అని అధికారి తెలిపారు. నిందితులపై ఐపీసీతో పాటు లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ (పోక్సో) చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఈ ఘటనపై మహిళా సంఘాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి.

మోడీ బదులివ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో .. 'మీ మాటలు మేము విన్నాం. మా మాటలూ మీరు వినండి. ఆ తరువాత మీ నేత రాహుల్ గాంధీ మాట్లాడేదేమీ ఉండదు' అని దుబే అన్నారు. సుప్రీంకోర్టు రాహుల్ కేసులో తీర్పు ఇవ్వలేదని, కేవలం క్రింది కోర్టు తీర్పును నిలిపేస్తూ ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. తాను క్షమాపణ చెప్పబోనన్నారు.

మెజార్టీ వర్సెస్ మైనార్టీ : డిఎంకె

అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా డికెఎం ఎంపి టిఆర్ బాలు మాట్లాడుతూ మణిపూర్ పరిణామాలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. దేశంలో మాదిరిగానే మణిపూర్‌లో కూడా మెజార్టీ వర్సెస్ మైనార్టీ వ్యవహారం జరుగుతోందన్నారు. చాలా దూకుడుతనాన్ని ప్రదర్శించే మోడీ ఇప్పుడు ఎక్కడున్నారని నిలదీశారు. టిఎంసి ఎంపి సౌగత రాయ్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఓటమి తరువాత ఆ రాష్ట్రానికి రూ.7,300 కోట్లు నిధులను కేంద్రం నిలిపేసిందన్నారు. ఇది హృదయం లేని ప్రభుత్వమని తెలిపారు.

మంచి రోజులెక్కడ మోడీజీ : ఎన్‌సిపి

ఎన్‌సిపి ఎంపి సుప్రియ సూలే మాట్లాడుతూ దేశంలో ద్రవ్యోల్బణం, మణిపూర్ హింసాత్మక ఘర్షణలను ప్రస్తావించారు. బిజెపి హామీ ఇచ్చిన "మంచి రోజులు" ఎక్కడ ఉన్నాయని మోడీ సర్కార్‌ను నిలదీశారు. మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బిరేంద్ర సింగ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సచివాలయాల్లో అయోమయమే

- రూల్స్ కోసం కమిటీ కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పడి మూడేళ్లు దాటిపోయినా ఇంకా అయోమయమే కొనసాగుతోంది. కార్యదర్శులు ఏ పనిచేయాలి, వాటికి సంబంధించిన నియమ నిబంధనలేమిటన్నవి ఇంకా ఖరారు కాలేదు. మహిళా పోలీసుల పరిస్థితియైతే మరింత ఘోరంగా ఉంది, ఈ నేపథ్యంలో నిబంధనల రూపకల్పనకు సంబంధించి మరోసారి అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.

దీనికోసం ఇప్పటికే ఏర్పాటుచేసిన అధికారుల కమిటీ తొలిసారి భేటీ అయి కొన్ని అంశాలపై రెండు రోజుల క్రితం చర్చించినట్లు సమాచారం. అయితే ఈ చర్చలు ఫలవంతం కాలేదని సమాచారం. మొత్తం సచివాలయాల వ్యవస్థకు సంబంధించి గత మే నెల్లో ఒక చట్టాన్ని కూడా తీసుకువచ్చారు. దీంతోఈ వ్యవస్థకు చట్టబద్ధత కలిగినప్పటికీ, ఎలా పనిచేయాలన్నదానిపై స్పష్టమైన నిబంధనలు లేకపోవడంతో పరిపాలనా సమస్యలు తలెత్తుతున్నాయి. జాబ్‌ఛార్ట్ సక్రమంగా లేకపోవడంతో ఎవరు ఏ పనిచేయాలన్నది కూడా అస్పష్టంగానే ఉంది. .ఇంకా డ్రాఫ్ట్ రూల్స్ కూడా తయారుకాకపోవడంతో సర్వీస్ రూల్స్ కూడా అమలు చేయడం కష్టంగా మారుతోందని అధికారులు అంటున్నారు.

సిబిఐ తన పని తాను చేస్తుంది

- వివేకా కుమార్తె సునీత

ప్రజాశక్తి-పులివెందుల టౌన్ (కడప జిల్లా)

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ తన పని తాను చేస్తుందని, జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని వివేకా కుమార్తె సునీత అన్నారు. వివేకా 72వ జయంతి సందర్భంగా కడప జిల్లా పులివెందులలోని వివేకా సమాధి వద్ద సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు మంగళవారం నివాళులర్పించారు. అనంతరం మీడియాతో సునీత మాట్లాడుతూ తన తండ్రి చెప్పిన మాటలను ఆమె గుర్తుకు చేశారు. పొగిడే వారి మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని, తప్పును వేలెత్తి చూపించే అంశాలపై దృష్టి సారించాలని అనేవారని పేర్కొన్నారు.



వేదికపై కళారూపం ప్రదర్శిస్తున్న మహిళలు



సీనియర్ నేత పుతుంబాక భారతిని పరామర్శిస్తున్న బృందా కరత్



సభలో మాట్లాడుతున్న పుణ్యవతి, రమాదేవి, ప్రభావతి

మోడీ మౌనం సిగ్గుచేటు

- మహిళలు 'మణిపూర్' దోషులను క్షమించరు
- హిందుత్వ రాజకీయాలే ఈ దుస్థితికి కారణం
- స్త్రీలపై హింసను అరికట్టడానికి అధ్యయన కమిటీ ఏర్పాటు చేయాలి
- పోరుయాత్ర ముగింపు సభలో బృందా కరత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మణిపూర్‌లో స్త్రీల పట్ల అమానుషంగా ప్రవర్తించి, మారణకాండకు పాల్పడిన వారిని, వారిని శిక్షించడానికి బదులుగా వెనకేసుకువస్తున్న శక్తులను దేశంలోని మహిళలు ఎన్నటికీ క్షమించరని ఐద్వా సీనియర్ నాయకురాలు బృందా కరత్ అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో విశాఖపట్నం, హిందూపురంల నుండి జులై 28న ప్రారంభమైన 'హింసపై పోరు యాత్ర'ల ముగింపుసభ మంగళవారం విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో జరిగింది. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో బృందా కరత్ మాట్లాడుతూ ప్రపంచం నివ్వెరపోయేలా మణిపూర్ హింసాకాండ సాగిందని అన్నారు. పోరుయాత్రలో భాగంగా పర్యటించిన సంఘం నేతలను అన్ని జిల్లాల్లో మహిళలు, విద్యార్థినులు మణిపూర్ సంఘటన గురించి వివరాలు అడిగారని చెప్పారు. రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా కూడా మహిళల్లో మణిపూర్ సంఘటన పట్ల తీవ్ర ఆందోళన నెలకొందని, ఆగ్రహం వ్యక్తమవుతోందని వివరించారు. మూడు నెలలుగా జరుగుతున్న ఈ ఘోరం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెదవి విప్పకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రపంచంలోని మరే దేశంలోనూ ఈ పరిస్థితి ఉండదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తన సోదరిని లైంగికదాడినుండి కాపాడుకునేందుకు 15ఏళ్ల బాలుడు అమరనాథ్ ప్రయత్నిస్తే ఆ బాలున్ని పెట్రోల్‌పోసి తగులబెట్టిన విషయాన్ని బృందా కరత్ ప్రస్తావించారు. రాష్ట్రంలో జరుగుతున్న వ్యవస్థీకృత నేరాలకు ఈ సంఘటన నిదర్శనమని అన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అధ్యయన కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బాలికలు, మహిళలు,దళితులు, ఆదివాసులపై దాడులను నియంత్రించలేని మోడీకి పదవిలో కొనసాగే అర్హత లేదన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రిని తక్షణం ఆ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి అమలు చేస్తున్న హిందుత్వ రాజకీయాలే ఈ దుస్థితి కారణమని చెప్పారు. ఆదివాసీలను ఊచకోత కోయడంతో పాటు మహిళలను నగ్నంగా ఊరేగిస్తుంటే డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. దేశంలో సంఘపరివార్ ఫాసిస్ట్ చర్యలతో మహిళలకు రక్షణ, భద్రతకు ముప్పు ఏర్పడిందని మహిళలు అంతా సంఘటితంగా ఈ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.. సగటున రోజుకు 86మంది మహిళలపై లైంగికదాడులు, 1151 మహిళలపై హింస కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. 74శాతం మహిళలపై జరిగే లైంగికదాడుల కేసుల్లో ఎలాంటి శిక్షలు పడటం లేదన్నారు. నరేంద్రమోడి అధికారంలోకి వచ్చిన 2014 నుండి 2022దాకా 35లక్షల కేసులు నమోదయ్యాయని తెలిపారు. బాలికలపై లైంగిక దాడులు కేసులు మూడు లక్షలకు పైగా వున్నాయని అన్నారు. ఈ కేసులను త్వరితగతిన విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మహిళలపై జరిగే లైంగికదాడుల కేసుల్లో మతం, కులం ఆధారంగా శిక్షలు విధించడం అనాగరికమైన చర్య అని అన్నారు. గుజరాత్ బిల్కిస్‌బానో కేసులో బ్రాహ్మణుల పేరుతో నిందితులను విడుదల చేయడం తగదని తక్షణం వారందరినీ తిరిగి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ తమపై ఏడాది కాలంగా లైంగికదాడులకు పాల్పడుతున్నారని ఢిల్లీలో క్రీడాకారులు ఆందోళన చేస్తుంటే , ప్రధాన మంత్రి ఆయనను తనపక్కన కూర్చొబెట్టుకుంటున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి మాట్లాడుతూ మహిళల హక్కుల గురించి చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. మహిళలపై దాడులకు పాల్పడే వారికి పాలకవర్గపార్టీలు వెన్నుదన్నుగా వుంటున్నాయని విమర్శించారు. బ్లేడ్ బ్యాచ్ గంజాయి బ్యాచ్‌లను వైసిపి, టిడిపి నాయకులు పెంచి పోషిస్తున్నారన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ మహిళలకు రక్షణకల్పించలేని ప్రభుత్వాలకు ఒక్క క్షణం కూడా అధికారంలో కొనసాగే అర్హతలేదన్నారు. మద్యం, మత్తుమందు, పోర్న్ వీడియోల వల్లే మహిళలు, బాలికలపై హింస ఎక్కువగా జరుగుతోందని చెప్పారు. అమర్‌నాథ్ ఘటనలోనూ దోషులను శిక్షించలేదన్నారు. విశాఖలో మైనర్ బాలికను గర్భవతిని చేసిన స్వామిజీ విషయంలోనూ ఇదే స్థితి నెలకొందన్నారు. మహిళలను రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. రాష్ట్రంలో 7వేల మంది బాలికలు, 22వేల మంది మహిళలు అదృశ్యమైనా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళా సంఘాలు, డ్వాక్రా మహిళలతో చర్చించి మహిళల భద్రతకు ఒక విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకులు పుతుంబాక భారతి, యార్లగడ్డ జోయ, శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ కె ధనలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వరూపారాణి, ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, ఎన్ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ కుటుంబసభ్యులకు బృందాకరత్ పరామర్శ

ప్రజాశక్తి-చెరుకుపల్లి (బాపట్ల జిల్లా)

దుండగుల చేతిలో కిరాతకంగా హత్యకు గురైన బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం, రాజోలు పంచాయతీ ఉప్పాలవారిపాలెంలో పదో తరగతి విద్యార్థి అమర్‌నాథ్ కుటుంబాన్ని వీడియో కాల్ ద్వారా ఐద్వా నాయకులు బృందాకరత్ మంగళవారం పరామర్శించారు. ఘటన వివరాలను మృతుని తల్లిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బృందాకరత్ మాట్లాడుతూ.. 'ఎందుకు మా అక్కని ఏడిపిస్తున్నారు' అని వారించినందుకు దుండగులు కక్షపూరిత ధోరణితో అమర్‌నాథ్‌ను కిరాతకంగా హత్య చేశారన్నారు. నిందితులను బెయిల్‌పై విడుదల చేయడం దుర్మార్గమన్నారు. దోషులకు శిక్ష పడకుండా ఆర్థిక, అధికార బలంతో కొందరు రక్షించే ప్రయత్నం చేస్తున్నారని, అలా చేస్తే అమర్‌నాథ్ కుటుంబసభ్యులకు రక్షణ లేకుండా పోతుందని చెప్పారు. వెంటనే నిందితులకు బెయిల్ రద్దు చేయాలని, జస్టిస్ వర్మ సిఫారసు ప్రకారం 45 రోజుల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు డి.రమాదేవి, కెవిపిఎస్ నాయకులు కె.శరత్ పాల్గొన్నారు.

'ఉక్కు'పై అదానీ గంగవరం పోర్టు అబద్ధాలు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సక్రమంగా దిగుమతులు అందజేసినట్లు అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం పేర్కొనడం అబద్ధమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ద్వారానే గంగవరం పోర్టుకు అత్యధిక లాభాలు వస్తున్నాయని తెలిపారు. అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం చేసిన తప్పుడు ప్రకటన నేపథ్యంలో జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ చెల్లింపులు ఆలస్యమైనప్పటికీ స్టీల్‌ప్లాంట్‌కు సక్రమంగా దిగుమతులు అందించామని, ఈ నెల 5న పోర్టు యాజమాన్యం చేసిన ప్రకటన అవాస్తవమని పేర్కొన్నారు. అదానీ గ్రూప్ యాజమాన్యానికి, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై శ్రద్ధ లేదని ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గంగవరం పోర్టుకు గత నెల 16 నుంచి 18వ తేదీ వరకూ రూ.వెయ్యి కోట్ల విలువైన కొకింగ్ కోల్ విదేశాలు నుంచి షిప్‌ల ద్వారా రాగా సముద్రంలోనే పోర్టు యాజమాన్యం ఆపివేసిందన్నారు. గంగవరం పోర్టు గోడ దాటగానే స్టీల్‌ప్లాంట్ ఉన్నా అదానీ యాజమాన్యం ప్రతి ఏటా ఐదు శాతం చొప్పున ఛార్జీలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వ పలుకుడితో విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి వసూళ్లు చేసుకుంటోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్లాంట్‌పై మోపిన అదనపు భారాన్ని తగ్గించాలని, పాత టారిఫ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దక్షిణ కొరియాకు చెందిన పోస్కో కంపెనీ, అదానీ గ్రూప్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నాలను 2017 నుంచీ ప్రారంభించాయన్న దానికి ఆధారాలు ఉన్నాయన్నారు. గంగవరం పోర్టును అదానీ గ్రూప్ స్వాధీనం చేసుకున్న తరువాత తమ ప్రయత్నాలను మరింత ముమ్మురం చేసిందని తెలిపారు. అధికారులు రిటైరైనా కొత్తగా ఒక్కరినీ ఉద్యోగంలోకి తీసుకోలేదన్నారు. మరోవైపున రూ.1800 కోట్లతో రైల్‌వీల్ ప్లాంట్ పెట్టి, ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ కొనుగోలు పేరుతో సుమారు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసి ఒక్క టన్ను కూడా నేటికీ విశాఖ స్టీల్‌కు రానీయకుండా చేసి ఆ నిధులను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగపరిచిందని విమర్శించారు. ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధులపై సిబిఐతో దర్యాప్తు

- ఎపి సర్పంచుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పంచాయతీల నిధులు మళ్లింపుపై సిబిఐతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ కోరాయి. ఈ మేరకు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను మంగళవారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్ర ప్రసాద్, సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్ వినతిపత్రం సమర్పించారు. 2019 నుంచి 2022 వరకు ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులు రూ.8,660 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇవ్వకుండా సొంత పథకాలకు వినియోగించుకుందని అన్నారు. 2022 నుంచి 2024 వరకు ఆర్థిక సంఘం నిధులను మొత్తం రూ.4,045 కోట్లను ఇప్పటికీ పంచాయతీలకు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ చట్టాల ప్రకారం ఏర్పడిన గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగేతర శక్తులకు అధికారాలు అప్పచెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జల్‌జీవన్ మిషన్ పథకం రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలుకావడం లేదని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించలేదని కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులను, ఉపాధి హామీ నిధులను నేరుగా గ్రామ పంచాయతీ పిఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లోనే జమ చేయాలని కోరారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ.. పంచాయతీ నిధుల మళ్లింపుపై కేంద్ర ఉన్నత స్థాయి కమిషన్‌తో విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

'అసైన్డ్' చట్టసవరణ సరికాదు

- ముగిసిన 'భూమి కోసం సమర శంఖారావం' పాదయాత్ర
- ర్యాలీ, ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా



ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (పశ్చిమగోదావరి)

అసైన్డ్ భూములను ఆక్రమించుకున్న వారికి యాజమాన్యపు హక్కులు కల్పిస్తూ 9/77 చట్ట సవరణ చేయడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్ల జంగారెడ్డిగూడెం స్థానిక సుందరయ్య కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. అసైన్డ్ భూముల ఆర్డినెన్స్ సవరణ వల్ల భూస్వాములే ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉందన్నారు. గతంలో కూడా అసైన్డ్ చట్ట సవరణ వల్ల పేదల కంటే అనర్హులే ఎక్కువ లబ్ధి పొందారని ఆందోళన వ్యక్తం చేశారు. అసైన్డ్ లబ్ధిదారుల జాబితాను గ్రామ సచివాలయంలో బహిరంగ పరచాలని, అర్హులకే యాజమాన్యపు హక్కులను కల్పించాలని కోరారు. అక్రమంగా అనుభవిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనర్హుల చేతుల్లో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తిరిగి హక్కుదారులకు లేదా వారి వారసులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల మేరకు సీలింగ్ భూములతో పాటు పేదలకు పంచడానికి అవకాశమున్న అన్ని రకాల భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. భూ సమస్యల పరిష్కారంలో పోలీసులు జోక్యం చేసుకోకూడదన్నారు. 9/77 చట్ట సవరణపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్, సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తామా ముత్యాలమ్మ పాల్గొన్నారు.

దీర్ఘకాలం విధులకు హాజరుకాని ప్రభుత్వ వైద్యులపై చర్యలు

- సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వాస్పత్రుల్లోని వైద్యుల్లో కొంతమంది దీర్ఘకాలంగా విధులకు హాజరుకాకుండా ఉన్నవారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యక్రమాలపై మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి (ఇహెచ్‌ఎస్) సంబంధించి ఉద్యోగులు నెలనెలా చెల్లించే మొత్తానికి సమానంగా ప్రభుత్వ వాటా సొమ్మును కూడా ప్రతినెలా సకాలంలో ఆరోగ్యశ్రీ ట్రస్టుకు జమయ్యేలా చూడాలని ఆర్థికశాఖ కార్యదర్శి గుల్జార్‌ను ఆదేశించారు. వైద్యారోగ్యశాఖలో ఖాళీలను భర్తీ చేయడంతోపాటు రూ.కోట్లు ఖర్చు చేసి వైద్య పరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామన్నారు. ప్రభుత్వ వైద్యులు దీర్ఘకాలం సెలవులో ఉండటం, అనధికారికంగా విధులకు గైర్హాజరు కావడం వంటివి ఎంతమాత్రం సమర్థనీయం కాదని సిఎస్ అన్నారు. విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, వైద్యకళాశాలల నిర్మాణాలు అనుకున్న సమయానికి పూర్తి చేయాలన్నారు. వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాతా, శిశు మరణాల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమీక్షా సమావేశంలో వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు జె నివాస్, ఆరోగ్యశ్రీ సిఇఒ ఎంఎన్ హరీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమ్మెకు ఎన్‌సిసిఒఇఇఇ, ఇఇఎఫ్ఐ మద్దతు

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యోగుల చేస్తున్న పోరాటానికి నేషనల్ కోర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎప్లాంయిస్ అండ్ ఇంజినీర్స్ (ఎన్‌సిసిఒఇఇఇ), ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) సంఘీభావం ప్రకటించాయి. ఈ నెల 10 నుంచి జరిగే విద్యుత్ ఉద్యోగుల నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపాయి. ఈ మేరకు మంగళవారం వేరువేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. విద్యుత్ ఉద్యోగుల పోరాటానికి అండగా ఉంటామని తెలిపాయి. స్మార్ట్ మీటర్ల బిగింపుతో సహా అన్ని రకాల ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఎపిఎస్‌పిఇ జాక్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు పోరాటం చేస్తున్నారని ప్రకటనల్లో తెలిపాయి.

పోలవరం నిర్మాణం ప్రశ్నార్థకమే....!

- నిర్వాసితులను నీట ముంచిన జగన్
- 23న ఏలూరులో కార్యాచరణ ప్రకటన : రామకృష్ణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం ప్రశ్నార్థకమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ఈ నెల 10న టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకోనున్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణను కరుణాకర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. అనంతరం తిరుపతిలో రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు 150 అడుగులు ఎత్తు నిర్మాణం జరగాల్సి ఉందని, 45.72 అడుగుల వరకు ఎత్తు తగ్గించి నిర్మాణం చేస్తే ప్రయోజనం ఉండదని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి జాతీయ ప్రాజెక్టు ఖర్చులు కేంద్రానికి తగ్గించడానికి చూస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కుట్ర పూరిత నిర్ణయంపై జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. 150 అడుగులు ఎత్తు ఉంటే 194 టిఎంసిలు నీటి నిల్వ ఉండే అవకాశం ఉందన్నారు. తద్వారా ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తాల జిల్లాలకు నీరందే అవకాశం ఉంటుందని తెలిపారు. దీంతోపాటు 940 మెగావాట్ల విద్యుత్ శక్తి ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ముంపు నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 23న ఏలూరులో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీ వైజాగ్‌లో ప్రారంభం అయ్యే బస్సు యాత్ర సెప్టెంబర్ 8వ వరకు వరకు కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు పాల్గొన్నారు.

అమెరికన్ బ్యాంక్‌ల పరపతి పతనం

- 10 బ్యాంక్‌ల రేటింగ్‌కు మూడీస్ కోత
- మరిన్ని విత్త సంస్థలకు హెచ్చరిక



వాషింగ్టన్ : అమెరికన్ బ్యాంక్‌ల పరపతి దెబ్బతింటుంది. అక్కడి ఆర్థిక వ్యవస్థలోని లోపాలు విత్త సంస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలోనూ మూడు, నాలుగు బ్యాంక్‌లు దివాలా అంచునకు చేరిన విషయం తెలిసిందే. తాజాగా గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అమెరికకు చెందిన 10 బ్యాంక్‌ల పరపతికి కోత పెట్టింది. మరిన్ని బ్యాంక్‌ల రేటింగ్‌ను తగ్గిస్తామని హెచ్చరించింది. దేశంలోని కొన్ని అతిపెద్ద రుణదాతల స్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపింది. స్థూలంగా 27 బ్యాంక్‌లపై అంచనాలను విడుదల చేసింది. దేశంలోని ఎంఅండ్‌టి బ్యాంక్, పినాకిల్ ఫైనాన్సీయల్ పార్ట్‌నర్స్, ప్రాస్పిరిటీ బ్యాంక్, బిఒకె ఫైనాన్సీయల్ కార్ప్ సంస్థల రేటింగ్‌కు కోత పెట్టింది. మరోవైపు బిఎన్‌వై మెల్లన్, యుఎస్ బన్‌కార్ప్, స్టేట్‌స్ట్రీట్, ట్రూయిస్ట్ ఫైనాన్సీయల్ విత్త సంస్థలను డౌన్‌గ్రేడ్ కోసం సమీక్షాలో ఉంచినట్లు మూడీస్ వెల్లడించింది. "చాలా బ్యాంకులు జూన్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో లాభదాయకత ఒత్తిళ్లను చవి చూశాయి. ఇది అంతర్గత మూలధనాన్ని ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఇది స్వల్ప మాంద్యం కారణంగా వస్తుంది. బ్యాంకులు వడ్డీ రేట్లు, వారి ఆస్తులు, బాధ్యతలను నిర్వహించడం వల్ల ఎక్కువ నష్టాలను ఎదుర్కొంటున్నాయి." అని మూడీస్ విశ్లేషించింది. ఈ ఏడాది ప్రారంభంలో సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్ పతనం అమెరికా బ్యాంకింగ్ రంగంపై విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేశాయి. ఈ పరిణామాలు అక్కడి సంక్షోభానికి అద్దం పట్టాయి. విశ్వాసాన్ని పెంచడానికి అధికారులు అత్యవసర చర్యలను ప్రారంభించినప్పటికీ.. ప్రాంతీయ బ్యాంకుల్లో డిపాజిట్లను ఉపసంహరించుకోవడానికి ప్రజలు పరుగులు పెట్టారు.

మూన్‌లైటింగ్ ఉద్యోగులకు ఐటి శాఖ షాక్

న్యూఢిల్లీ : ఐటి పరిశ్రమలో రెండేసి ఉద్యోగులు (మూన్‌లైటింగ్) చేసే వారికి ఆదాయపు పన్ను శాఖ షాక్ ఇచ్చింది. ముఖ్యంగా కరోనా లాక్‌డౌన్ సమయంలో చాలా మంది ఉద్యోగులు అధిక ఆదాయం కోసం రెండేసి ఉద్యోగాలు చేశారు. కానీ.. ఆ ఆదాయాలను ఐటి రిటర్న్‌లలో చూపించలేదు. దీంతో ఆయా ఉద్యోగులకు ఐటి శాఖ నోటీసులు జారీ చేసిందని ఇటి ఓ కథనంలో పేర్కొంది.

ప్రస్తుతానికి 2019-2020, 2020-2021 ఆర్థిక సంవత్సరాల ఆదాయాలకు సంబంధించి నోటీసులు ఇచ్చిందని సమాచారం. మూన్‌లైటింగ్ ద్వారా సంపాదిస్తున్న వారిలో ఎక్కువ మంది ఐటి రంగం, అకౌంటింగ్ మేనేజ్‌మెంట్ నిపుణులు ఉన్నారు. మూన్ లైటింగ్ సంపాదనపై పన్ను చెల్లించని దాదాపు 1000 మందికి పైగా ఉద్యోగులకు ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేసింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. మూన్‌లైటింగ్‌కు పాల్పడిన వారిని కొన్ని సంస్థలు ఉద్యోగం నుంచి తొలగించిన ఘటనలు ఉన్నాయి. తొలుత రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు వార్షికాదాయాన్ని రిటర్నుల్లో చూపించని వారికి ఈ నోటీసులు పంపినట్లు తెలుస్తోంది.

ఏడాదిలో ఆకాశ ఎయిర్‌కు 4.9% వాటా

న్యూఢిల్లీ : భారత విమానయాన రంగంలోకి ప్రవేశించిన అనాతికాలంలోనే మెరుగైన ప్రగతిని కనబర్చుతున్నట్లు ఆకాశ ఎయిర్ తెలిపింది. ఏడాది కాలంలోనే 0 శాతం నుంచి 4.9 శాతానికి మార్కెట్ వాటాను పెంచుకున్నట్లు తెలిపింది. కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుండి 84 శాతం కంటే ఎక్కువ ప్రయాణీకుల లోడ్ ఫ్యాక్టర్‌ను నమోదు చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు అక్యూపెన్సీ 90 శాతానికి చేరినట్లు పేర్కొంది. భారత్‌లో ఈ సంస్థ 2022 ఆగస్ట్‌లో తొలిసారి విమాన కార్యకలాపాలను ప్రారంభించింది.

సామ్‌సంగ్ నుంచి కొత్త ఉత్పత్తులు

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ భారత మార్కెట్లోకి పలు నూతన ఉత్పత్తులను విడుదల చేసింది. ఇందులో గెలాక్సీ ఫోల్డబుల్స్ ఐదవతరం, వాచ్ 6సిరీస్, టాబ్ ఎస్9 సిరీస్‌లు ఉన్నాయని ఆ సంస్థ తెలిపింది. గెలాక్సీ వాచ్6, క్లాసిక్‌లను ఆవిష్కరించింది. ఈ రెండింటి ధరలను వరుసగా రూ.29,999గా, రూ.36,999గా నిర్ణయించింది. ట్యాబ్ ఎస్ సీరిస్‌లో అల్ట్రా, ఎస్9 ప్లస్, ఎస్9 వేరియంట్లను విడుదల చేయగా.. వీటి ధరలను రూ.1,19,999గా, రూ.90,999గా, రూ.96,999గా ప్రకటించింది. ఆయా ఉత్పత్తులపై పలు రాయితీలను అందిస్తున్నట్లు తెలిపింది.

పెప్పర్‌ఫ్రై సిఇఒ అంబరీస్ మూర్తి మరణం



ముంబయి : ప్రముఖ ఫర్నీచర్, హోమ్ డెకార్ ఉత్పత్తులను విక్రయించే ఇ-కామర్స్ సంస్థ పెప్పర్‌ఫ్రై సహ వ్యవస్థాపకుడు, సిఇఒ అంబరీష్ మూర్తి హఠన్మారణం చెందారు. 51 ఏళ్ల అంబరీష్ సోమవారం లేహ్‌లో గుండెపోటుతో మరణించారని ఆ సంస్థ మరో సహ వ్యవస్థాపకుడు ఆశిష్ షా ఎక్స్ ఓ ట్వీట్‌లో తెలిపారు. తరుచూ ముంబయి నుంచి లేహ్‌కు బైక్‌పై వెళ్లే అంబరీష్ లేహ్‌కు చేరుకున్న తర్వాత ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. 2012లో మూర్తి, ఆశిష్‌తో కలిసి పెప్పర్‌ఫ్రైను స్థాపించారు.

ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ 'ఎకో ఫ్రెండ్లీ' డెబిట్ కార్డ్



న్యూఢిల్లీ : ఫిన్‌టెక్ సంస్థ ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ కొత్తగా ఎకో ఫ్రెండ్లీ డెబిట్ కార్డ్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. దేశంలోనే తొలిసారి పర్యావరణ అనుకూల పదార్థం ఆర్ పివిసి మెటీరియల్‌తో తయారు చేసినట్లు పేర్కొంది. తమ సంస్థలో సేవింగ్స్ బ్యాంక్ ఖాతాతో కొత్త, ఇప్పటికే ఖాతాదారులుగా ఉన్న వారు దీన్ని పొందవచ్చని వెల్లడించింది. ఆర్‌పిసి కార్డులతో హైడ్రోకర్బన్ వినియోగంలో 43 శాతం తగ్గించొచ్చని పేర్కొంది. ఈ కార్డ్ ద్వారా రూ.10,000 వరకు ఇ-కామర్స్ ప్రయోజనాలు పొందవచ్చని ఆ సంస్థ సిఒఒ గణేష్ అనంతనారాయణన్ పేర్కొన్నారు.

సూక్ష్మ రుణాల కోసం 200 సెంటర్లు

- తెరిచిన యూనియన్ బ్యాంక్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సులభంగా సూక్ష్మ రుణాలను జారీ చేయడానికి వీలుగా దేశ వ్యాప్తంగా 200 మైక్రో ప్రాసెసింగ్ సెంటర్లు (ఎంపిసిఎస్) తెరిచింది. మంగళవారం వీటిని ఆ బ్యాంక్ ఎండి, సిఇఒ మనిమెఖలయి వర్చ్యువల్‌గా ప్రారంభించారు. పిఎం స్వనిధీ, పిఎంఎస్‌బివై, పిఎంజెజెబివై, ఎపివై, ఎన్‌యుఎల్‌ఎం తదితర ప్రభుత్వ పథకాల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆ బ్యాంక్ తెలిపింది.

1 నుండి నిరసన వారం

ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సిపిఎం కేంద్రకమిటీ పిలుపు

న్యూఢిల్లీ : ధరల పెరుగుదలకు నిరసనగా, ఉపాధి కల్పన కోరుతూ సెప్టెంబరు 1 నుండి 7 వరకుదేశవ్యాప్తంగా అన్ని పార్టీ శాఖలు నిరసన వారం పాటించాలని సిపిఎం పిలుపునిచ్చింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ ఈ నెల 4-6 తేదీల్లో న్యూఢిల్లీలో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. అనంతరం ఒక ప్రకటన జారీ చేసింది.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

మణిపూర్‌లో మతవిద్వేషంతో కూడిన జాతి ఘర్షణలు గత మూడు మాసాలకు పైగా కొనసాగుతుండడం పట్ల కేంద్ర కమిటీ తన తీవ్ర అసమ్మతిని తెలియజేస్తోంది. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు వందలాదిమంది చనిపోయారు. వేలాది మంది నిర్వాసితులై, అమానవీయ పరిస్థితుల్లో సహాయ శిబిరాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వ దోషి అనేది సుస్పష్టం. ప్రధాని మోడీ మౌనం వహించడం, కేంద్ర ప్రభుత్వం చేష్టలుడిగినట్లు వ్యవహరించడం చూస్తుంటే మణిపూర్‌ను మరింతగా అరాచకత్వంలోకి, మారణ హోమంలోకి నెట్టేలా ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉదాసీనత ఏ స్థాయిలో ఉందో ఇది తెలియజేస్తోంది. పార్లమెంట్‌కు జవాబుదారీ వహించాల్సిన బాధ్యతను విస్మరించే వైఖరిని ప్రధాని మోడీ ఎంచుకున్న ఫలితంగా, పార్లమెంటరీ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. మణిపూర్ ఘర్షణలు ఈశాన్య ప్రాంతంలోని సమీప రాష్ట్రాలకు విస్తరిస్తుండడమనేది అత్యంత తీవ్రమైన పర్యవసానాలు కలిగివుంది. శాంతి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు మొదటి చర్యగా ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాజీనామా చేయాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది.

పెచ్చరిల్లుతున్న మతోన్మాద పోకడలు

హర్యానా మత హింస : నుహ్‌లో ప్రారంభమై, గురుగావ్, ఇతర ప్రాంతాలకు విస్తరించడం ద్వారా మేవాట్ ప్రాంతంలో చెలరేగిన మతోన్మాద హింసాకాండ నేపథ్యంలో హర్యానా బిజెపి ప్రభుత్వం అనుసరించిన దారుణమైన బుల్డోజర్ రాజకీయాలను కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ హింసకు పాల్పడిన దోషులు, రెచ్చగొట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి బదులుగా హర్యానా రాష్ట్ర బిజెపి ప్రభుత్వం మైనారిటీ కమ్యూనిటీని లక్ష్యంగా చేసుకుంటోంది. ముస్లింలకు చెందిన దుకాణాలు, ఇళ్లను ధ్వంసం చేసే చర్యలను పెద్ద ఎత్తున అమలు చేస్తోంది. వీరిలో చాలామంది చట్టపరమైన యాజమాన్య పత్రాలను కలిగి వున్నారు. కొంతమంది కోర్టు స్టే ఉత్తర్వులను కూడా తెచ్చుకున్నారు. అయినప్పటికీ, వాటితో సంబంధం లేకుండా బిజెపి రాష్ట్ర ప్రభుత్వం వీరి ఆస్తులను ధ్వంసం చేసే చర్యలకు దిగింది. అయితే, గతనాలుగు రోజులుగా సాగుతున్న ఈ కూల్చివేతలు, విధ్వంసకాండను నిలుపు చేయాలంటూ పంజాబ్, హర్యానా హైకోర్టు స్టే విధించింది.

విద్వేష నేరాలు : రైల్వే రక్షక దళానికి చెందిన కానిస్టేబుల్ ఒక అధికారిని, ముగ్గురు ముస్లిం ప్రయాణికులను దారుణంగా హతమార్చడం అత్యంత అమానవీయమైన విద్వేష నేరం. ముస్లిం కమ్యూనిటీని రాక్షసులుగా చిత్రీకరిస్తూ బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ నేతలు సాగించే విషపూరితమైన విద్వేష ప్రసంగాలు, ప్రచారం ఫలితంగా ఇటువంటి నేరాలు పెరుగుతున్నాయి. హిందుత్వ శక్తుల విషపూరితమైన ఎజెండా భారతీయ రిపబ్లిక్ లౌకిక, ప్రజాతంత్ర స్వభావాన్ని ధ్వంసం చేస్తోంది, గర్హనీయమైన ఈ ఘటన భారత్‌కు ఒక మేల్కొలుపు వంటిది.

ప్రామాణికమైన డేటా అంటే కేంద్రానికి భయం

ప్రజల్లో నెలకొన్న రక్తహీనత, అంగ వైకల్యానికి సంబంధించిన ప్రశ్నలను జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 నుండి తొలగించడం పట్ల కేంద్ర కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

భారతదేశంలో 57శాతం మహిళల్లో, 67శాతానికి పైగా పిల్లల్లో రక్తహీనత వుందని గత సర్వేల్లో వెల్లడైంది. ఇతర కారణాలతో పోల్చుకుంటే ప్రసూతి మరణాల్లో, శిశు మరణాల్లో రక్త హీనత అనేది ప్రధాన కారణంగా వుంది. ఇక వైకల్యానికి సంబంధించిన ప్రశ్నలను తొలగించడమనేది తిరోగమన చర్య.

కచ్చితమైన డేటా పట్ల మోడీ ప్రభుత్వం భయంతో వుంది. పైగా దాన్ని ధిక్కరించే విషయంలో కూడా నిస్సంకోచంగా వ్యవహరిస్తోంది. ప్రపంచంలో అన్ని చోట్లా జనాభా లెక్కల ద్వారానే డేటాను సేకరిస్తుండగా, భారత్‌లో మాత్రం ఆ ప్రక్రియను నిరవధికంగా వాయిదా వేస్తూ వస్తున్నారు.

ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపిఎస్) డైరెక్టర్ కె.ఎస్.జేమ్స్‌ను సస్పెండ్ చేయడాన్ని కేంద్ర కమిటీ ఖండించింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలను నిర్వహించేది ఈ సంస్థే. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5లో వెల్లడించిన డేటా, బహిరంగ మల విసర్జన రహిత దేశంగా భారత్ మారిందన్న వాదన గురించి మోడీ ప్రభుత్వం చెప్పుకునేదానితో ఏ మాత్రమూ సరిపోలడం లేదు.

గిరిజనుల నిరసనకు మద్దతు ర్యాలీ : అటవీ సంరక్షణ (సవరణ) చట్టం, 2023, ఏకరూప పౌర స్మృతికి వ్యతిరేకంగా ఆగస్టు 9వ తేదీన దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని ఆదివాసీ సంస్థలు ఇచ్చిన పిలుపునకు కేంద్ర కమిటీ మద్దతునిచ్చింది. అటవీ హక్కుల చట్టం, ఇతర చట్టాలు హామీ కల్పించిన హక్కులను ఈచట్టం తిరస్కరిస్తుంది. సాంప్రదాయ చట్టాల సంరక్షణకు రాజ్యాంగపరమైన హామీలను ఇది నేరుగా ప్రభావితం చేస్తుంది.



సమాఖ్యవాదంపై దాడులు

ఆర్థిక సమాఖ్యవాదం : రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్వేచ్ఛను మరింతగా కుదించేలా పబ్లిక్ బారోయింగ్స్ (పబ్లిక్ రుణాల) నిర్వచనాన్ని మోడీ ప్రభుత్వం ఇటీవల మార్చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే బడ్జెట్‌లో లేని రుణాలను, అదనపు బడ్జెట్ రుణాలను ఇప్పుడు ప్రభుత్వ రుణాల జాబితాలో భాగంగా పరిగణిస్తారు.. అయితే, ఇది కేంద్రం తీసుకునే పబ్లిక్ రుణాలకు వర్తించదు. పైగా, వెనుకటి కాలం నుండి కూడా దీనిని వర్తింపచేస్తున్నారు. కేరళ వంటి రాష్ట్రానికి, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.17,310కోట్లు కొరత ఏర్పడనుంది. ఫలితంగా రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బడ్జెట్‌లో పెద్ద ఎత్తున లోటు ఏర్పడుతుంది. ఇది, రాష్ట్ర హక్కులపై తీవ్రంగా దాడి చేయడమే.

ఢిల్లీ ఆర్డినెన్స్ : అధికార యంత్రాంగంపై నియంత్రణతో సహా పాలనకు సంబంధించిన ప్రధాన రంగాలపై, ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వానికి గల హక్కులను సమర్ధిస్తూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇటీవల ఇచ్చిన సుప్రీం తీర్పును రద్దు చేస్తూ అత్యంత నిరంకుశమైన ధోరణిలో, మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకు వచ్చింది. ఇది కోర్టు ధిక్కారమే కాకుండా, రాజ్యాంగం సమాఖ్య స్వభావంపై, సుప్రీం కోర్టు నిర్వచించినట్లుగా జవాబుదారీ, ప్రజాస్వామ్య పాలన నిబంధనలపై నేరుగా దాడి చేయడం కూడా.

లోక్‌సభలో తనకున్న అధిక మెజారిటీని ఉపయోగించుకుని, రాజ్యసభలో బిజెడి, వైఎస్‌ఆర్‌సిపి వంటి ప్రాంతీయ పార్టీల మద్దతుతో మోడీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చింది.

జాతీయ ఆస్తులు లూటీ: కార్పొరేట్-మతతత్వ శక్తులు కుమ్మక్కయి జాతీయ ఆస్తుల లూటీకి చట్టబద్ధత కల్పించేలా కొత్త చట్టాలను తీసుకొస్తోంది. పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయాలను ఉపయోగించుకుని జాతీయా ఆస్తుల ప్రైవేటీకరణకు వీలు కల్పించే కీలకమైన బిల్లులను ఆమోదింప జేసుకుంది. వీటిల్లో అభివృద్ధి పేరుతో అన్నింటికీ మినహాయింపును అందచేసే అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు, 2023 వుంది. జాతీయాస్తులను కొల్లగొట్టడానికి కార్పొరేట్లకు ఇది సాయపడుతుంది. పర్యవసానంగా చోటు చేసుకునే అడవుల నరికివేత దేశంలో వాతావరణ మార్పులపై చాలా తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, 2023ని కూడా ఆమోదించారు. లిథియంతో సహా కీలకమైన, విలువైన ఖనిజ వనరులను ప్రైవేటుగా తవ్వుకోవడానికి ఈ బిల్లు వీలు కల్పిస్తోంది. తీర ప్రాంతాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, 2023ని ఆమోదించారు. ప్రైవేటుగా తీర ప్రాంతాల్లో ముడి చమురు అన్వేషణ కోసం ఈ బిల్లు వీలు కల్పిస్తోంది.

మహిళలు, ఆడపిల్లలపై పెరుగుతున్న నేరాలు

మహిళలు, ఆడపిల్లలపై దాడులు పెరుగుతున్నాయి. వారిపై చోటు చేసుకుంటున్న నేరాలు ఆందోళన కలిగించే రీతిలో పెరుగు తున్నాయి. సగటున 86 అత్యాచార కేసులు రోజువారీ నమోదవుతున్నాయని ఎన్‌సిఆర్‌బి డేటా తెలియచేస్తోంది.

2021లో మహిళలపై ప్రతి గంటకూ 49నేరాలు జరిగాయి. 2020లో మొత్తంగా అత్యాచార కేసులు 28,046 నమోదు కాగా, 2021లో 31,677కి పెరిగాయి. మహిళలపై నేరాల సంఖ్య 2020లో 3,71,503గా వుండగా, 2021లో ఆ సంఖ్య 4,28,278కి పెరిగింది. అనేక కేసుల్లో నిందితుల పట్ల మోడీ ప్రభుత్వం కనబరిచే ఆదరాణాభిమానాలు నేరస్తుల్లో శిక్ష పడుతుందనే భయం లేకుండా చేసే సంస్కృతికి దారి తీస్తోంది.

జ్ఞానవాపి మసీదు వివాదం

ఆరాధనా స్థలాల చట్టం-1991ని అత్యున్నత స్థాయిలోని న్యాయ వ్యవస్థ కఠినంగా ఎందుకు అమలు చేయడం లేదన్నది ఒక అంతుచిక్కని రహస్యంగా వుందంటూ కేంద్ర కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశంలోని ఆరాధనా స్థలాలకు సంబంధించి యథాతథ స్థితిని పరిరక్షించాలని ఈ చట్టం పేర్కొంటోంది. దీని నుంచి ఏకైక మినహాయింపు అయోధ్య. ఈ చట్టం చేసే సమయంలో అయోధ్య వివాదం కోర్టు కార్యకలాపాల పరిధిలో వుండడం వల్ల ఆ మినహాయింపు ఇవ్వడం జరిగింది.. జ్ఞానవాపి మసీదు ఆవరణలో సర్వే నిర్వహించేందుకు ఎఎస్‌ఐని అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు ఈ నెల 3న ఉత్తర్వులు జారీ చేసింది. 1991 ప్రార్ధనా స్థలాల చట్టం చెల్లుబాటును పదే పదే సమర్ధిస్తూ వచ్చిన సుప్రీం కోర్టు కూడా ఈ సర్వేను ఆపేందుకు ఎలాంటి యత్నం చేయలేదు. ఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది.

కేంద్ర కమిటీ పిలుపు

- ధరల పెరుగుదలకు నిరసనగా, ఉపాధి కల్పన కోరుతూ సెప్టెంబరు 1 నుండి 7 వరకుదేశవ్యాప్తంగా అన్ని పార్టీ శాఖలు నిరసన వారం పాటించాలి.
- సాధ్యమైనంత త్వరలో వామపక్షాల సదస్సును నిర్వహించే ప్రయత్నాలు చేపట్టాలి. పరస్పర అంగీకృతమైన డిమాండ్ల పత్రంపై దేశవ్యాప్త ప్రచారాన్ని చేపట్టాలి.
- .కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటించిన కార్యాచరణకు మద్దతునివ్వాలి.
- .అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఇచ్చిన పిలుపు మేరకు అక్టోబరు 5న అఖిల భారత ఢిల్లీ ర్యాలీకి మద్దతునివ్వాలి.

నోరుజారిన పియూష్ గోయల్

- 'న్యూస్‌క్లిక్'తో ప్రతిపక్షాలకు సంబంధమంటూ తప్పుడు ఆరోపణలు
- సభా హక్కుల కింద నోటీసులివ్వడంతో వెనక్కి

న్యూఢిల్లీ : స్వతంత్ర మీడియా సంస్థ 'న్యూస్‌క్లిక్'కు ప్రతిపక్షాలకు చెందిన పలువురు నేతలకు సంబంధముందని, వారంతా 'ట్రాయిటర్స్' (ద్రోహులు) అంటూ రాజ్యసభ సభానాయకుడు, కేంద్ర మంత్రి పియూష్ గోయల్ తప్పుడు ఆరోపణలు చేశారు. దీనిపై ప్రతిపక్ష కూటమి ఇండియాకు చెందిన టిఎంసి, ఆప్, ఆర్‌జెడి, డిఎంకె, ఆర్‌జెడి, జెడియు, ఎన్‌సిపి, వామపక్షాల నేతలు సభా హక్కుల కింద నోటీసులు ఇచ్చారు. గోయల్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై ఫిర్యాదు చేస్తూ రాజ్యసభ ఛైర్మన్‌కు ఇండియా పార్టీలు నోటీసులిచ్చాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రతిపక్ష నేతలందరినీ ద్రోహులుగా పేర్కొంటూ గోయల్ వ్యాఖ్యలు చేసినందుకు సభా హక్కుల నోటీసును అందచేసినట్లు కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ ట్విట్టర్‌లో తెలిపారు. ఇండియా పార్టీల నేతలపై తీవ్ర అభ్యంతకరకరమైన రీతిలో, పూర్తిగా ఆమోదయోగ్యం కాని రీతిలో చేసిన వ్యాఖ్యలకు గానూ గోయల్ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తున్నా అందుకు తిరస్కరిస్తున్నారని రమేష్ తెలిపారు. సభా వేదికగా ఆయన క్షమాపణ చెప్పాల్సిందేని డిమాండ్ చేశారు. సభలో ఈ విషయమై గందరగోళం చెలరేగింది. దీంతో పార్లమెంటరీయేతర వ్యాఖ్యలను తాను వెనక్కి తీసుకుంటానని సభలో గోయల్ చెప్పారు. వాటిని రికార్డుల నుండి తొలగించాల్సిందిగా ఆయన ఛైర్మన్‌ను కోరారు. కాగా తమకు కొందరు రాజకీయ నాయకులతో సంబంధాలున్నట్లు వచ్చిన ఆరోపణలను న్యూస్‌క్లిక్ వార్తా సంస్థ ఖండించింది. ఇవి పూర్తిగా తప్పుడు ఆరోపణలనీ, తమ సంస్థ స్వతంత్రమైనదని, స్వేచ్ఛాయుతంగా నడుపుతున్నామని పేర్కొంది.

యుసిసి ముసాయిదా తయారీని విరమించుకోండి

- కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

తిరువనంతపురం : బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఏకరూప పౌరస్మృతి (యుసిసి) ముసాయిదా తయారీని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ కేరళ అసెంబ్లీ మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ సభలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యుడిఎఫ్ కూటమి కూడా ఈ తీర్మానానికి మద్దతు పలికింది. ఈ సందర్భంగా విజయన్ ప్రసంగిస్తూ . కుల వ్యవస్థను ఆమోదించే, మహిళల పట్ల తీవ్ర పక్షపాతం కలిగిన మనుస్మృతి అంశాలతో యుసిసిని నింపడానికి బిజెపి ప్రయత్నం చేస్తుందని అన్నారు.

రైల్వేలో ఒపిఎస్ అమల్జేయాలి : ఎన్‌ఎఫ్ఐఆర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సైన్యంలో అమలవుతున్న పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను రైల్వేలో అమలు చేయాలని నేషనల్ ఫెడరేషన్ అఫ్ ఇండియన్ రైల్వేమ్యాన్ (ఎన్‌ఎఫ్‌ఐఆర్) ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం తెచ్చిన కొత్త పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఆగష్టు 10 న రైల్వే కార్మికులతో మహా ఆందోళనకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా దాదాపు లక్ష మంది కార్మికులు ఈ మహ ప్రదర్శన ర్యాలీ లో పాల్గొంటారన్నారు. మహా ప్రదర్శన అనంతరం ప్రధానిని కలిసి వినతి పత్రం సమర్పించనున్నట్లు చెప్పారు. కాగా, 2014 నుంచి అమలులో ఉన్న కొత్త పెన్షన్ విధానంతో రైల్వే లో కొత్తగా చేరిన కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని, అందువల్ల ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్రం గుప్పెట్లోకి గ్రంథాలయాలు

- రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాలోకి లైబ్రరీలు
- బిల్లు తెచ్చేందుకు కేంద్రం యోచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గ్రంథాలయాలను త్వరలో కేంద్ర ప్రభుత్వం గుప్పెట్లోకి తీసుకోనుంది. రాష్ట్ర అంశాల్లోకి చొరబడేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నంగా, సమాఖ్య వ్యవస్థపై పోటుగా పలువురు దీనిని పరిగణిస్తున్నారు. గ్రంథాలయాల పనితీరులో జోక్యం చేసుకోవడానికి, సంఘ్ పరివార్ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి విస్తృత ఎజెండాలో భాగమే ఈ చర్య అని చాలా మంది అభిప్రాయపడ్డారు. రాష్ట్రాల పరిధిలోని లైబ్రరీల వ్యవస్థను ఉమ్మడి జాబితా (కాంకరెంట్ లిస్ట్)కి బదిలీ చేసేందుకు, తన పరిధిలోకి తీసుకునేందుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ త్వరలో పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టనుంది.

ఢిల్లీలో జరిగిన రెండు రోజుల 'ఫెస్టివల్ ఆఫ్ లైబ్రరీస్-2023'లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన గ్రంథాలయాల ప్రతినిధులు హాజరైన సందర్భంగా, లైబ్రరీలను ఉమ్మడి జాబితాకు బదిలీ చేయడంపై చర్చలు జరిగాయి. రాజారామ్మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ డైరెక్టరు జనరల్ ప్రొఫెసర్ అజయ్ ప్రతాప్ సింగ్ లైబ్రరీలను సాంస్కృతిక మంత్రిత్వశాఖ పరిధిలోకి తీసుకురావాలనే ప్రభుత్వ సంకల్పానికి సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర గ్రంథాలయాలను తీర్మానం చేసి కేంద్ర మంత్రిత్వశాఖ పరిశీలనకు సమర్పించాలని కోరినట్లు సమాచారం. ఈ సమావేశానికి ఎపి నుంచి ఎవరూ హాజరుకాలేదు. తెలంగాణ నుంచి గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ అయాచితం శ్రీధర్, 14 జిల్లాల గ్రంథాలయ ఛైర్మన్లు పాల్గొన్నారు.

తీవ్రంగా వ్యతిరేకించిన కేరళ

లైబ్రరీలను ఉమ్మడి జాబితాకు బదిలీ చేయడాన్ని కేరళ ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. ఈ కార్యక్రమానికి హాజరైన కేరళ స్టేట్ లైబ్రరీ కౌన్సిల్ కేంద్రం నిర్ణయంపై నిరసన వ్యక్తం చేసింది. కేరళ ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్ బిందు కేంద్రం చర్యపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. కేరళలో లైబ్రరీ వ్యవస్థలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పాలనా వ్యవస్థ ఉందని, లైబ్రరీ వ్యవస్థను ఉమ్మడి జాబితాలో చేర్చడంతో ప్రజాస్వామ్య స్వభావాన్ని, వైవిధ్యాన్ని తొలగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇది రాష్ట్రాల అధికారాలు, గ్రంథాలయాల స్వాతంత్ర్యానికి భంగం కలిగించడమేనని మంత్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వస్తే గ్రంథాలయాలు స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయని అన్నారు. పుస్తకాలు కొనుగోలు చేసేందుకు నిధుల పంపిణీలో కూడా వివక్ష చూపే అవకాశం ఉందని తెలిపారు.

దేశంలో 46,746 లైబ్రరీలు

దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 46,746 లైబ్రరీలు ఉన్నాయి. అందులో మహారాష్ట్రలో అత్యధికంగా 12,191 లైబ్రరీలు ఉన్నాయి. కేరళలో 8,415, కర్ణాటకలో 6,798, తమిళనాడులో 4,622, గుజరాత్‌లో 3,464 లైబ్రరీలు ఉండగా, ఎపిలో 978, తెలంగాణలో 672 లైబ్రరీలు ఉన్నాయి. ఎపిలో 13 జిల్లా, 4 డివిజనల్, 178 సిటీ, టౌన్, 782 గ్రామీణ లైబ్రరీలు ఉన్నాయి.

తెలుగుగడ్డపై గ్రంథాలయాల ఉద్యమం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ లైబ్రరీలు మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించబడుతున్నాయి. 1956లో అవిభక్త రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆంధ్ర ప్రాంతంలోని 11 జిల్లాల్లో మద్రాసు పౌర గ్రంథాలయాల చట్టం, తెలంగాణ ప్రాంతంలోని 9 జిల్లాల్లో హైదరాబాద్ పబ్లిక్ లైబ్రరీస్ చట్టం అమలులో ఉన్నాయి. సమ్మిళిత చట్టం కోసం, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీస్ చట్టం 1960లో రూపొందించబడింది. ఈ చట్టం 1964, 1969, 1987, 1989, 2016లో వరుసగా సవరించబడింది. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత, తెలంగాణ గ్రంథాలయాల కోసం ప్రత్యేక చట్టం రూపొందించబడింది. 19వ శతాబ్దంలో ఆంధ్రాలో పబ్లిక్ లైబ్రరీ ఉద్యమం విజయవతంగా సాగింది. ఆ తరువాతి దశాబ్దాలలో ఇది క్రమంగా పెరిగింది. 1800లో పరవస్తు కుటుంబానికి చెందిన ఒక ప్రైవేట్ లైబ్రరీ ప్రజల కోసం తెరవబడింది. ఇది తరువాత ఆర్ష గ్రంథాలయంగా అభివృద్ధి చేశారు. రాజా రామేశ్వర రాయలు (1821-1865) లైబ్రరీ కూడా వనపర్తి, మహబూబ్‌నగర్‌లలో ప్రజలకు తెరిచారు.

సిఎఎ నిబంధనల రూపకల్పనకు మళ్లీ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టం, 2019 (సిఎఎ) నిబంధనలను రూపొందించడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మరోసారి గడువు పొడిగించింది. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుండి వచ్చిన ఎలాంటి పత్రాలు లేని ముస్లిమేతర వలసదారులకు పౌరసత్వాన్ని వేగవంతం చేసే ఈ చట్టాన్ని నాలుగేళ్ల క్రితం పార్లమెంట్ ఆమోదించినప్పటి నుండి ఇప్పటివరకు అమలు కాలేదు.

సిఎఎ నిబంధనల రూపకల్పనకు సెప్టెంబరు చివరి వరకు గడువును ఇవ్వాలని కోరుతూ హోం శాఖ, ఈ చట్టంపై లోక్‌సభ పార్లమెంట్ కమిటీకి లేఖ రాసిందని ప్రభుత్వ అధికారి తెలిపారు. కమిటీ కూడా ఆ గడువును ఆమోదించిందని చెప్పారు. ఇలా గడువును పొడిగించడం ఇది ఎనిమిదవ సారి. జూన్ 30వరకు గడువును పొడిగించాలని జనవరిలో హోం శాఖ అభ్యర్థించింది. 2019 డిసెంబరు 11న ఈ చట్టాన్ని ఆమోదించారు. డిసెంబరు 12న రాష్ట్రపతి ఆమోద ముద్ర లభించింది. 2020 జనవరి 10 నుండి ఈ చట్టం అమల్లోకి వస్తుందని కేంద్ర హోం శాఖ ప్రకటించింది. చట్టాన్ని ఆమోదించిన తర్వాత ఆరు నెలల నిర్దిష్ట కాల పరిధిలో చట్ట నిబంధనలను మంత్రిత్వ శాఖ రూపొందించలేని పక్షంలో "ఇటువంటి పొడిగింపునకు గల కారణాలను చెబుతూ పార్లమెంట్ కమిటీని గడువు కోరాల్సి వుంటుంది." అని పార్లమెంటరీ కార్యకలాపాలపై మాన్యువల్ పేర్కొంటోంది.

పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుండి వచ్చిన హిందూ, సిక్కు, పార్శీ, క్రైస్తవ, బౌద్ధ, జైన్ కమ్యూనిటీల సభ్యులకు పౌరసత్వం మంజూరు చేయాలని సిఎఎ తీసుకొచ్చారు. అయితే ఎలాంటి పత్రాలు లేకుండా వీరు 2014 డిసెంబరు 31కి ముందుగా భారత్‌లోకి ప్రవేశించి వుండాలని పేర్కొన్నారు. ఈశాన్యంలోని పలు ప్రాంతాలను సిఎఎ నుండి మినహాయించారు. అయితే పౌరసత్వాన్ని మతంతో ముడిపెట్టడంపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే.

రాజ్యసభలో మూడు బిల్లులు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభలో మంగళవారం కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. ఆందోళనల మధ్య మూడు బిల్లులను మోడీ సర్కార్ ఆమోదింపజేసుకుంది. ప్రతిపక్షాల ఆందోళనలతో పదేపదే వాయిదా పడి తిరిగి 2 గంటలకు సభ ప్రారంభం కాగా ఇంటర్ సర్వీస్ ఆర్గనైజేషన్ బిల్లు, ఐఐఎం బిల్లు, నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లు ఆమోదం పొందాయి.

అమెజాన్ అడవుల పరిరక్షణకు కొత్త ప్రణాళిక

- లాటిన్ అమెరికా దేశాల అధినేతల ప్రతిన

బెలెం (బ్రెజిల్): అమెజాన్‌లో అడవుల పరిరక్షణకు లాటిన్ అమెరికా దేశాల అధ్యక్షులు ప్రతిన బూనారు. భూగోళంపై ఉన్న అతిపెద్ద ఉష్ణ మండల అదవును నాశనం చేసే విధ్వంస చక్రాన్ని నిలుపు జేసేందుకు కొత్త అభివృద్ధి నమూనాను ప్రోత్సహించాలని ఈ దక్షిణ అమెరికా దేశాలు తీర్మానించాయి. అటవీ నిర్మూలన, అక్రమ మైనింగ్, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కారణంగా అడవులు ఎక్కువగా హరించుకుపోతున్నాయని వారు పేర్కొన్నారు. అమెజాన్ అటవీ నిర్మూలనను ఆపేందుకు బ్రెజిల్ అమెజాన్ అడవులకు ముఖ ద్వారంగా ఉన్న పారా రాష్ట్రంలోని బెలెంలో బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా అధ్యక్షతన ఇక్కడ శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. సోమవారం జరిగిన విదేశాంగ, పర్యావరణ మంత్రుల స్థాయి సమావేశం బెలెం డిక్లరేషన్ ముసాయిదాను ఖరారు చేసింది. ఇందులో దాదాపు 130 అంశాలున్నాయి. అడవులను నిలబెట్టే ప్రణాళిక ఉంది. 63 లక్షల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం కలిగి, 5 కోట్ల మందికి ఆసరాఆ ఉన్న అమెజాన్ అడవులను మునుపటి బోల్సనారో ప్రభుత్వం తగులబెట్టింది. లూలా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమెజాన్ అడవుల నిర్మూలనను చాలా వరకు కట్టడి చేశారు. ఈ అడవుల్లో ఉంటున్న మూలవాసీ తెగల జీవన స్థితిగతుల మెరుగుదలకు పలు చర్యలు చేపట్టారు. అటవీ నిర్మూలనను పూర్తిగా ఆపేందుకు నిర్దిష్ట గడువును విధించడం, కొత్త ప్రాంతాలు, మూలవాసీలు ఉండే భూ భాగాల ద్వారా 80 శాతం బయోమ్‌ను రక్షించడం, వాతావరణ అత్యవసర పరిస్థితిని అమెజాన్‌లో ప్రకటించడం వంటి పలు సూచనలు, సలహాలు సైంటిఫిక్ కమ్యూనిటీ, ఎన్‌జివోల నుంచి ఈ సదస్సు స్వీకరించింది. అమెజాన్‌కు తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు, అలాగే మూలవాసీల హక్కుల రక్షణకు మధ్య సమతుల్యతను సాధించాలని ముసాయిదా డిక్లరేషన్ పేర్కొంది. ఈ సదస్సుకు బొలీవియా,బ్రెజిల్, కొలంబియా, ఈక్వెడార్, గయానా, పెరూ, సురినామ్, వెనిజులా తదితర దేశాలకు చెందిన దాదాపు 600 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈక్వెడార్, సురినామ్ దేశాల అధినేతలు హాజరుకాలేదు.





చిట్టీ పొట్టీ పాపాయి

చిట్టీ పొట్టీ పాపాయి
చిన్నీ గౌనూ వేసింది
గజ్జల పట్టీ కట్టింది
పలకా బలపం పట్టింది

దేవునికి దండం పెట్టింది
అవ్వా వేలూ పట్టింది
బుడిబుడి అడుగులు వేసింది
వడి వడిగా బడికి వెళ్ళింది

చిట్టీ పొట్టీ పాపాయి
అక్షరమాలను నేర్చింది
చిట్టీ చిట్టీ చేతులతో
చదువుల తల్లికి మొక్కింది


అందరిలోనా పాపాయి
అన్నిట మేటిగ నిలిచింది
అందరి మన్ననలు పొందింది
ఆనందంగా గడిపింది

గణగణ గంట మోగింది
సంచి భుజాన వేసింది
టాటా.. బాయ్ బాయ్..అంటూ
ఇంటికి బయలు దేరింది!



- ముక్కామల జానకీరామ్
63053 93291

లెక్క చేయండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలను అంకెలతో గుణించి సమాధానాలు ఇచ్చాం. చివరి వరుస సమాధానం మీరు రాయండి.

జవాబు : 10

నేను గీసిన బొమ్మ





సి మాన్యత,
5వ తరగతి,
విశ్వసాయి డాక్టర్
ఎస్ఆర్‌కె స్కూలు,
నెల్లూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



ఆదివారం రాత్రి, ముషీరాబాద్ చర్చి వద్ద మణిపూర్ శరణార్థులు

కలలు చెదిరిన బతుకులు

వారి అందమైన కలలన్నీ చెదిరిపోయాయి. ఉన్న ఊళ్లు భస్మీపటలం అయ్యాయి. కుటుంబ సభ్యులందరూ చెల్లాచెదురైపోయారు. ద్వేషం విషమై విస్తరించి, వారి బతుకులను అల్లకల్లోలం చేసింది. రాత్రికి రాత్రే వారు తమ సర్వస్వాన్ని అక్కడే వదిలేసి, కేవలం కట్టుబట్టలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని - దొరికిన రైళ్లు, బస్సులూ ఎక్కి, ఎక్కడెక్కడికో చెదిరిపోయారు. అలా రక్షణ లేని తమ సొంత రాష్ట్రం నుంచి కొంతమంది హైదరాబాదుకు తరలివచ్చారు. అవును.. ఇది మణిపూర్ ఆదివాసీలు కుకీల కన్నీటి వలస కథ. గుండె చెదిరే బతుకు వ్యథ.

ఖైలాల్‌తంగ్ … 23 ఏళ్ల యువకుడు. మే 4వ తేదీ తెల్లవారు జామున తమ ఊరి మీదికి మూక దాడి జరగబోతుందని తెలిసి, తొలుత సమీప అడవిలోకి పారిపోయాడు. జూన్ 14 వరకూ పునరావాస కేంద్రంలో తల దాచుకున్నాడు. పరిస్థితి మెరుగుపడే సూచన కనపడకపోవడంతో– ఇంకెక్కడికైనా వెళ్లి ఉపాధి పొందాలి అనుకున్నాడు. ఏం చేయాలో తోచని స్థితిలో రోడ్డు మీద వేచి చూస్తుంటే– ఓ ట్రక్కు డ్రైవరు జాలిపడి ఉచితంగా మిజోరం వరకూ తీసుకొచ్చాడు. ఖైలాల్‌తంగ్ అక్కడి నుంచి బయల్దేరి జులై 3న హైదరాబాదు చేరుకున్నాడు. సొంతూరు నుంచి ప్రాణభయంతో బయల్దేరినప్పుడు ఓ పొట్టి నిక్కరు, టీ షర్టు వేసుకొని ఉన్నాడు. ఆ హడావిడిలోనూ ఆధార్ కార్డు, కొన్ని ముఖ్యమైన సర్టిఫికెట్లు తన వెంట తెచ్చుకున్నాడు. మే 4న తమ ఊరిపై జరిగిన మూకదాడి దృశ్యం ఇంకా భయం భయంగా కనిపిస్తూనే ఉంది.



ఖైలాల్‌తంగ్

"మే 4 తెల్లవారుజాము 3 గంటల సమయంలో మెయితీ గుంపు మా ఊరిపై దాడి చేసింది. ఆ దాడిలో మా ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అంతకుముందు రోజు రాత్రే.. మేం హాస్పటల్ నుంచి ఇంటికి చేరుకున్నాం. మా అమ్మకు డయాలసిస్ చేయించుకుని వచ్చేసరికి రాత్రి 11 అయ్యింది. అప్పటికే గ్రామంలో మెయితీ గుంపు దాడికి తెగబడబోతుందని మాకు సమాచారం వచ్చింది. రాత్రికి రాత్రే గ్రామంలోని మహిళలను, పెద్దవాళ్లను, పిల్లలను కొండల్లోకి పంపించేశాం. 160 కుటుంబాలు ఉన్న మా గ్రామంలో అప్పుడు యువకులు, పురుషులు మాత్రమే మిగిలారు. కర్రలు, ఆయుధాలు చేతబట్టిన గుంపు గ్రామంలోకి ప్రవేశించింది. వాళ్లను అడ్డుకునేందుకు మా దగ్గర ఏ ఆయుధమూ లేదు. జంతువులను, పక్షులను వేటాడే.. వడిసెల మాత్రమే మా ఆయుధం. దాంతో ఎంతవరకు పోరాడుతాం? తరువాత పారిపోవాల్సి వచ్చింది.

ఊరికి దూరంగా పారిపోయి, అక్కడి నుంచి చూస్తుంటే– ఊరు తగలబడిపోతూ కనిపించింది. కొండల్లో, పొదల్లో దాక్కున్న గ్రామస్తులు కాలిపోతున్న తమ ఇళ్లను చూసి ఏడుస్తూనే ఉన్నారు. ఆ గుంపు గ్రామం వదిలి వెళ్లేదాకా అక్కడే దాక్కున్న మేమంతా ఆ తరువాత మంటల్లో కాలిపోయిన తమ ఇళ్లల్లో మిగిలివున్న వస్తువుల కోసం పరుగులు పెట్టారు. కానీ, గ్రామంలో మాకంటూ ఏమీ మిగల్లేదు. మా ఆనవాళ్లు అన్నీ తుడిచి పెట్టుకుపోయాయి. ఆశ చంపుకోలేక కాలిపోగా మిగిలిన చిన్న చిన్న వస్తువులను సేకరిస్తూ, సాయంత్రం 6 గంటలప్పుడు ఒకచోటకు చేర్చాం.

అప్పుడే ఆ మహిళ వచ్చింది ...

చుట్టుపక్కల కుకీల గ్రామాలన్నీ ఆరోజు అలాంటి దారుణమైన దాడులకే గురయ్యాయి. పట్టుబడ్డ కుకీలను హింసించారు. అలా దాడికి గురైన ఓ మహిళ చిరిగిన బట్టలతో, ఒంటినిండా గాయాలతో ఏడుస్తూ మా గ్రామం వైపు వచ్చింది. ఆమె తీవ్ర అవమానానికి గురైన మహిళల సమీప బంధువని తెలిసింది. తరువాత ఆమెతో పాటు మా ఊరి బాలింతలు, గర్భిణీలు, పిల్లలు, పెద్దలు, అందరం గ్రామం వదిలి అడవిగుండా రెండు రోజులపాటు ప్రయాణించాం. కొండలు, గుట్టలు ఎక్కి దిగుతూ వచ్చిన మాకు మచ్చి బ్లాకులోని 'కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్' (కెఎస్ఒ) రక్షణ ఇచ్చింది. కాంగ్పోక్పి, లంకా జిల్లాలోని పునరావాస కేంద్రాలకు తరలించింది. తరువాత నేను అక్కడి నుంచి మిజోరామ్‌కు, ఆ తరువాత హైద్రాబాద్‌కి చేరుకున్నాను.

హైద్రాబాద్ ఉనౌ ఆదివాసీ ఫోరమ్ లెక్కల ప్రకారం మణిపూర్ నుంచి 19 కుటుంబాలకు చెందిన 130 మంది సభ్యులు హైద్రాబాద్‌లో తలదాచుకున్నారు. ఇక్కడ ఉన్న బంధువులతో కొంతమంది అనుసంధానమైతే.. మరికొంతమందిని కుకీ స్టూడెంట్ ఆర్గనైజేషన్, కుకీ వర్షిప్ సర్వీస్, తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్, ఇతర స్వచ్ఛంద సంస్థలు అక్కున చేర్చుకున్నాయి.

ఇక్కడ ఉదయం నిద్ర లేవగానే రోడ్ల నిండా జనం కనిపిస్తున్నారు. ఎన్నో నిద్రలేని రాత్రులు తరువాత ఇప్పుడు కొంత ప్రశాంతంగా జీవిస్తున్నాను. అక్కడ రోజు కూలీగా పనిచేస్తూ అనారోగ్యంతో ఉన్న అమ్మానాన్నను చూసుకునేవాడ్ని. ఊరు వదిలి బయటకి రావడం ఇదే మొదటిసారి. ఇక్కడ ఓ ఫైనాన్షియల్ కంపెనీలో చిన్న ఉద్యోగంలో చేరాను. ఈ జీతంతో అమ్మానాన్నను చూసుకుంటూనే, తమ్ముడిని స్కూలికి పంపిస్తాను."

అతడిని విద్వేషంతో ఒక మూక చేసిన గాయం బాధిస్తూనే ఉంది. కానీ, ఆ చేదు జ్ఞాపకాలను దాటుతూ, కుటుంబాన్ని పోషించాలనే తపన అతడిని ఆశతో జీవించేలా చేస్తోంది.



ను చిన్‌చిన్, పా లునా

టీచర్ల వలసబాట

ను చిన్‌చిన్, పా లునా కొత్త జంట. హైస్కూల్ టీచర్లుగా ఇంగ్లీషు, లెక్కలు బోధిస్తూ భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కన్నారు. కానీ, మణిపూర్ కల్లోలంలో బతుకుతెరువు కోసం హైద్రాబాద్ చేరాల్సి వచ్చింది. పొదుపు చేసిన సొమ్ము రూ.45 వేలు తమ వెంట తెచ్చుకున్నారు. ప్రయాణ ఖర్చులు, ఇంటిఅద్దె పోను ఇప్పుడు నెలకు రూ.5 అధిక వడ్డీకి రూ.52 వేల అప్పులో ఉన్నారు. చిన్‌చిన్ ఓ ఈ కామర్స్ సంస్థలో మరో వారం రోజుల్లో ఉద్యోగంలో చేరనుంది. సికింద్రాబాద్‌లో ఓ సర్వీస్ సంస్థకు దరఖాస్తు చేసిన లూనాకి ఇంకా ఆఫర్ లెటర్ రాలేదు.



సుబేదార్ మేజర్ లెత్కోథంగ్స్

వీరోచిత సుబేదార్ ఇప్పుడు ఓ వలసదారు

అస్సాం రెజిమెంట్ కుకీ ఆఫ్ బోంగ్బాల్ ఖులెన్ గ్రామంలో రిటైర్డ్ సుబేదార్ మేజర్ లెత్కోథంగ్స్‌ది ఇప్పుడు ఒక విషాద గాథ. మే 5న తన గ్రామాన్ని రక్షించుకునేందుకు ఆయన చాలా ప్రయత్నం చేశాడు. తన దగ్గరున్న డబుల్ బేరల్ ఆయుధంతో మరో 30 మంది గ్రామస్తుల తోడ్పాటుతో … గ్రామంపై దాడికి వచ్చిన గుంపును చెదరగొట్టాడు. తరువాత ఆ గుంపు బలం పెరిగింది. 'ఆర్మీ యూనిఫామ్‌లో 8 జీపుల్లో వచ్చి ఊరి మీద పడ్డారు. అప్పటివరకు పోరాడిన మేము, ఆ క్షణం మా వాళ్లని రక్షించుకునేందుకు పరుగులు పెట్టాం. మహిళలను, పిల్లలను, పెద్దవాళ్లను కొండల్లోకి తరలించాం. అడవిలో రెండు రోజులు గడిపాం' అని చెబుతున్నప్పుడు ఆయన గొంతులో తీవ్ర ఆవేదన ధ్వనించింది.

ఆయన కుమార్తె హైద్రాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా చేస్తోంది. ఆమె దగ్గరకు ఆయన కుటుంబం చేరుకుంది. సుబేదార్ మేజర్ తనరిటైర్‌మెంట్ డబ్బుతో గ్రామంలో రూ.40 లక్షలు ఖర్చు పెట్టి ఇల్లు కట్టుకున్నాడు. మెయితీ గుంపు దాడిలో అది పూర్తిగా ధ్వంసమైంది. ఇల్లు కూలిపోయిందని బాధ ఉన్నా, గ్రామస్తులను కాపాడానన్న సంతోషం ఆయన కళ్లల్లో కనపడుతోంది.

… ఇలా చెల్లాచెదురైపోయిన మణిపూర్ బాధితులందరూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారన్న ఆశ లేదు. ఎన్ని కుటుంబాలు పూట గడవక పస్తులు ఉంటున్నాయో! ఎంతమంది బిడ్డలు చదువులు ఆగిపోయి రోడ్డున పడ్డారో..! అమ్మానాన్నను వదిలి ఎంతమంది పిల్లలు అనాథలయ్యారో.. !


(ది హిందూ సౌజన్యంతో...)



పిచ్చుకపై బ్రహ్మాస్త్రమా? : చిరంజీవి

పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలాగా సినీ పరిశ్రమపై కొందరు రాజకీయాలు జొప్పిస్తున్నారని సినీనటులు చిరంజీవి విమర్శించారు. చిరంజీవి, రవితేజ హీరోలుగా నటించిన 'వాల్తేరు వీరయ్య' చిత్రం కొన్ని సెంటర్లలో 200 రోజులు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా యూనిట్ హైదరాబాద్‌లో ద్విశతదినోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సినీ పరిశ్రమను చుట్టుముడుతున్న రాజకీయాంశాలను ప్రస్తావించారు. 'మీలాంటి వాళ్లు (రాజకీయ నాయకులు) ప్రత్యేక హోదా, ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం గురించి ఆలోచించాలి. సంక్షేమ పథకాలు, ఉద్యోగ–ఉపాధి అంశాలపై దృష్టి సారించాలి. పేదరికం పోయేలా చూడాలి. అభాగ్యుల కడుపు నింపే దిశగా ఆలోచించాలి. అలా చేసినప్పుడే ప్రజలు మెచ్చుకుంటారు. అంతేగానీ పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం లాగా సినీ పరిశ్రమపై పడతారేంటి' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఒకప్పుడు సినిమాలు 100, 175, 200 రోజులు ఆడేవి. ఇప్పుడు 2–3 వారాలు ఆడితే గొప్ప అనుకునే పరిస్థితుల్లో వాల్తేరు వీరయ్య 200 రోజులు ప్రదర్శితమవడం ఎంతో సంతోషంగా ఉంది'. ఈ విజయానికి గుర్తుగా షీల్డు అందుకున్నందుకు ఒళ్లు పులకరిస్తోంది, చరిత్రను మళ్లీ తిరగరాసినట్లుంది' అని ఎమోషనల్ అయ్యారు. చిరంజీవి మరో మూడు రోజుల్లో భోళాశంకరుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. మెహర్ రమేష్ తెరకెక్కించిన ఈ సినిమాలో తమన్నా హీరోయిన్‌గా నటించింది. మెగాస్టార్ సోదరిగా కీర్తి సురేష్ కనిపించనుంది. సుశాంత్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 11న థియేటర్లలో విడుదల కానుంది.

మళ్లీ సెట్‌పైకి 'ఉస్తాద్ భగత్‌సింగ్'



పవన్ కళ్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో మొదలైన 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం ఓ షెడ్యూల్ పూర్తి చేసుకున్నట్లుగా సమాచారం. పవన్ కల్యాణ్ వారాహి యాత్రలో బిజీ కావడం వల్ల తదుపరి షెడ్యూల్ కాస్త ఆలస్యమైన సంగతి తెలిసిందే. దీంతో సినిమా ఆగిపోయిందనే కామెంట్లు వస్తున్న నేపథ్యంలో నిర్మాత నవీన్ క్లారిటీ ఇచ్చారు. 'వాల్తేరు వీరయ్య' సినిమా 200 డేస్ సెలబ్రేషన్స్ వేదికగా ఆయన మాట్లాడారు. ఈ చిత్రం ఆగిపోలేదని, త్వరలో తాజా షెడ్యూల్ మొదలవుతుందని తెలిపారు. విడుదల గురించి కూడా క్లారిటీ ఇచ్చారు. వచ్చే ఏడాది సంక్రాంతి, లేదా వేసవిలో విడుదలకు ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. దీంతో సినిమాపై వస్తున్న రూమర్స్‌కు చెక్ పడింది. పవన్‌కల్యాణ్ సరసన శ్రీలీలా కథానాయికగా నటిస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



21 ఏళ్ల యువకుడిగా ...


నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో 'ఎక్స్‌ట్రా' చిత్రం షూటింగ్ జరుగుతోంది. కథానుగుణంగా ఈ సినిమా ప్లాష్‌బ్యాక్‌లో నితిన్ 21 ఏళ్ల యువకుడిగా కనిపిస్తాడు. ఇందుకోసం వీఎఫ్‌ఎక్స్ సహాయంతో నితిన్‌ను చూపించబోతున్నారని తెలిసింది. ఈ ఎపిసోడ్ కథలో కీలకంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు.

ఆస్కార్ దర్శకుడు విలియం ఫ్రిడ్‌కిన్ మృతి



హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు విలియం ఫ్రిడ్‌కిన్ (87) సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. హాలీవుడ్ అగ్ర దర్శకుల్లో విలియం ఒకరు. హర్రర్ సినిమాల ట్రెండ్ సెట్ చేసింది ఆయనే. ఐదు దశాబ్దాల కిందటే 'ది ఎగ్జారసిస్ట్' హర్రర్ సినిమాను తీసి పేరు తెచ్చుకున్నారు. క్రూజింగ్, బగ్, కిల్లర్ జూ వంటి థ్రిల్లర్ సినిమాలను తీశారు. కామెడీ, యాక్షన్, ఫ్యామిలీ సినిమాలను సైతం చేశారు. ది ఫ్రెంచ్ కనెక్షన్, ది ఎగ్జారసిస్ట్, ది బ్రింక్స్ జాబ్, ది గార్డియన్, జేడ్, ది హాంటెడ్ వంటి సినిమాలు ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం విలియం దర్శకత్వం వహించిన ది కేయిన్ ముటినీ కోర్ట్–మార్షల్ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది.

పుష్ప-2లో ఫాహద్ ఫస్ట్‌లుక్



పుష్ప సినిమాలో భన్వర్‌సింగ్ షెకావత్‌గా నటించిన ఫాహద్ పార్ట్–2లో కూడా నటించనున్నారు. ఫుల్ లెంగ్త్ రోల్‌తో ఇందులో కూడా అలరించనున్నట్లుగా తెలుస్తోంది. పుష్ప–2 ఫాహద్ నటనపై ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదలైంది. అల్లు అర్జున్ (బన్నీ), సుకుమార్ (సుక్కు) కాంబోలో తెరకెక్కిన 'పుష్ప' గొప్ప ప్రేక్షకాదరణ పొందింది. హిందీలో విడుదలై అక్కడ కూడా బాగానే ఆడింది. పుష్ప–2ను వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

హాలీవుడ్ నటికి అలియా భట్ తెలుగు



బాలీవుడ్ నటి అలియా భట్ 'హార్ట్ ఆఫ్ స్టోన్' చిత్రం ద్వారా హాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఈ సినిమాలో ఆమె ప్రతి నాయిక ఛాయలున్న పాత్రలో కనిపించబోతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా అలియా భట్ తన సహ నటులు గాల్ గడోట్, జేమీ డోర్నన్‌తో కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాలీవుడ్ నటి గాల్‌కు తెలుగు నేర్పించే ప్రయత్నం చేశారు. 'అందరికీ నమస్కారం.. మీకు నా ముద్దులు' అని పలకమన్నారు. ఆ పదాలను గాల్ అతి కష్టంపై పలికే ప్రయత్నం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. టామ్ హార్పర్ తెరకెక్కించిన ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్ ద్వారా ఈనెల 11న విడుదలవుతోంది. ఇంగ్లీష్, తెలుగుతోపాటు ఇతర భారతీయ భాషల్లోనూ స్ట్రీమింగ్ కానుంది.

శివాలెత్తిన సూర్యకుమార్

- మూడో టి20లో విండీస్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు
- సిరీస్ ఆశలు సజీవం



గయానా: టి20 సిరీస్‌లో వెనుకబడ్డ టీమిండియా నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో రాణించింది. వెస్టిండీస్ నిర్దేశించిన 160 పరుగుల లక్ష్యాన్ని 17.5 ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి ఛేదించింది. మిస్టర్ 360 డిగ్రీస్ సూర్యకుమార్ కేవలం 44 బంతుల్లో 10ఫోర్లు 4 సిక్సర్ల సాయంతో ఏకంగా 83పరుగులకు తోడు నిలకడగా రాణిస్తున్న హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ(49నాటౌట్) టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించారు. సూర్యకుమార్ యాదవ్ ఔటయ్యే సమయానికే సరికే టీమిండియాను విజయతీరాలకు చేర్చాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా(20నాటౌట్) చివర్లో సిక్సర్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సూర్యకుమార్ యాదవ్‌కు లభించింది. తొలుత టాస్ గెలిచిన బ్యాటింగ్‌కు దిగిన విండీస్‌ను కుల్దీప్ యాదవ్(3/28) తన స్పిన్ మాయాజాలంతో కట్టడి చేశాడు. దీంతో వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో విండీస్ 5 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ 45, కైల్ మేయర్స్ 25 పరుగులు చేసి శుభారంభం అందించారు. ఆ తర్వాత వచ్చిన నికోలాస్ పూరన్ తొలుత మెరుపులు మెరిపించినా.. టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఒకే ఓవర్లో జాన్సన్ చార్లెస్(12), పూరన్‌లను అవుట్ చేసి విండీస్ జోరుకు కళ్లెం వేశాడు. పూరన్ 12 బంతుల్లో 20 పరుగులు చేశాడు. చివర్లో కెప్టెన్ రోవ్ మాన్ పావెల్ ధాటిగా ఆడడంతో విండీస్ స్కోరు 150 మార్కు దాటింది. పావెల్ 19 బంతుల్లో ఫోర్, 3సిక్సులతో 40 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. టీమిండియా బౌలర్లలో కుల్దీప్ యాదవ్‌కు మూడు, అక్షర్ పటేల్, ముఖేశ్ కుమార్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో టీమిండియా అరంగేట్రం హీరో యశస్వి జైస్వాల్(1) అభిమానులు పెట్టుకున్న ఆశలను అడియాశలు చేశాడు. శుభ్‌మన్(8) కూడా నిరాశపరచడంతో టీమిండియా 34 పరుగులకే 2వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో సూర్యకుమార్ యాదవ్(83)కి తోడు తిలక్ వర్మ(49), హార్దిక్(20) అజేయంగా నిలిచి మ్యాచ్‌ను ముగించారు. నాల్గో టి20 12న శనివారం జరగనుండగా.. ఐదు టి20ల సిరీస్‌లో వెస్టిండీస్ జట్టు 2–1 ఆధిక్యతలో ఉంది.

క్వార్టర్స్‌కు ఫ్రాన్స్, కొలంబియా



ముగిసిన ప్రి క్వార్టర్స్ పోటీలు ఫిఫా మహిళల ప్రపంచకప్

సిడ్నీ: ఫిఫా మహిళల ప్రపంచకప్ క్వార్టర్‌ఫైనల్లోకి ఫ్రాన్స్, కొలంబియా జట్లు ప్రవేశించాయి. మంగళవారం జరిగిన ఆఖరి ప్రి క్వార్టర్స్ పోటీల్లో ఫ్రాన్స్ జట్టు మొరాకను, కొలంబియా జట్టు జమైకాను ఓడించాయి. తొలి మ్యాచ్‌లో ఫ్రాన్స్ జట్టు 4–0గోల్స్ తేడాతో మొరాకోపై ఘన విజయం సాధించింది. ఫ్రాన్స్ తరఫున డియానీ(15వ ని.), కెంజా డాలీ(20వ ని.), యజెనీ(23, 70వ ని.)లో రెండు గోల్స్ కొట్టారు. మరో ఉత్కంఠ పోటీలో కొలంబియా జట్టు 1–0గోల్స్ తేడాతో జమైనాను చిత్తుచేసింది. కొలంబియా తరఫున ఏకైక గోల్‌ను కాలలిన ఉష్మే(51వ ని.)లో చేసింది. నేటితో ప్రి క్వార్టర్స్ పోటీలు ముగియగా.. శుక్రవారం(ఆగస్టు 11) నుంచి క్వార్టర్‌ఫైనల్ పోటీలు ప్రారంభం కానున్నాయి.

క్వార్టర్‌ఫైనల్స్..

11(శుక్ర) : స్పెయిన్ × నెదర్లాండ్స్(ఉ.6.30గంIIలకు)
జపాన్ × స్వీడన్(మ.1.00గంIIలకు)
12(శని) : ఆస్ట్రేలియా × ఫ్రాన్స్(మ.12.30గంIIలకు)
ఇంగ్లండ్ × కొలంబియా(సా.4.00గంIIలకు)

ప్రణయ్ 9వ ర్యాంక్



సింధు ర్యాంక్ మెరుగు
బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్ విడుదల

లాసన్నె: ప్రపంచ బ్యాడ్మింటన్ ఫెడరేషన్(బిడబ్ల్యుఎఫ్) తాజా ర్యాంకింగ్స్ లో హెచ్‌ఎస్ ప్రణయ్ టాప్–10లో నిలిచాడు. బిడబ్ల్యుఎఫ్ మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ ఇద్దరూ వరుసగా 9, 11వ ర్యాంకులో ఉన్నారు. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియా ఓపెన్‌లో సెమీస్ చేరిన యువ సంచలనం ప్రియాన్షు రజావత్ మూడు స్థానాలు ఎగబాకాడు. 28వ స్థానంలో నిలిచాడు. ఇక మహిళల సింగిల్స్‌లో పివి సింధు తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంది. తాజా ర్యాంకింగ్స్‌లో ఆమె 15వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఒక్క టైటిల్ కూడా గెలవలేకపోయిన సింధు రెండు స్థానాలు ఎగబాకడం విశేషం. ఆస్ట్రేలియా ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరడంతో ఆమె ర్యాంకు మెరుగుపడింది. ఇక కిదాంబి శ్రీకాంత్ 19వ స్థానం నుంచి 20వ ర్యాంకుకు పడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి 2వ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా.. మహిళల డబుల్స్‌లో త్రీష జాలీ–గాయత్రి గోపిచంద్ రెండు స్థానాలు కోల్పోయి, 19వ ర్యాంక్‌లో నిలిచారు.

మనోజ్ తివారీ యు టర్న్

కోల్‌కత్తా: పశ్చిమ బెంగాల్ క్రీడా శాఖ మంత్రి మనోజ్ తివారీ రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. మాజీ క్రికెటర్ల అభ్యర్థన మేరకు తన రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు మంగళవారం ప్రకటించాడు. దీంతో మళ్లీ రంజీ ట్రోఫీలో బెంగాల్ తరఫున ఆడనున్నాడు. గురువారం (ఆగస్టు 3) ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తివారీ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. రంజీల్లో మెరుగైన రికార్డు కలిగిన తివారీ పది వేల పరుగుల మైలురాయికి చేరువలో ఉన్నాడు. మరో 98 పరుగులు చేస్తే.. 10 వేల క్లబ్‌లో చేరనున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68